J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 41 15.03.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## అధిక బలం కోసం ఒకరు.. అధికారం కోసం మరొకరు

# ఆంధ్రాలో వ్యూహాత్మక పొత్తులు.. ఎత్తులు!



- ఎన్‌డిఏని బలోపేతం చేసే దిశగా బీజేపీ
- ఆంధ్రాలో అధికారమే ఆశయంగా టీడీపీ
- 'నారీ నారీ నడుమ మురారి'లా జేఎస్‌పీ
- గెలుపు ధీమాతో దూసుకుపోతున్న వైసీపీ



## ఆంధ్రా ఫలితాలపైనే ఆధారపడ్డ నేతల భవిష్యత్తు!

రానున్న సార్వత్రిక ఎన్నికలతో ఆంధ్ర రాజకీయాలు అత్యంత కీలక మలుపు తీసుకోబోతున్నాయి. ఆంధ్రాలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మళ్ళీ అధికారంలోకి వస్తే తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు శకం ముగిసిపోయినట్లే. ఆ పార్టీ మూతబడిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదు. ప్రత్యేక పరిస్థితులలో టీడీపీకి మెజారిటీ సీట్లు లభించి ఆ పార్టీ అధికార పీఠం సాధిస్తే, రాబోయే ఐదేళ్ళు వైసీపీకి, ఆ పార్టీ నాయకులకి కష్టకాలమే. ఆంధ్రాలో ప్రధానంగా తలపడుతున్న రెండు ప్రాంతీయ పార్టీలలో ఏ పార్టీ విజయం సాధించినా కమలనాథులకి మాత్రం నష్టం లేదు. కేంద్రంలో ఖచ్చితంగా మళ్ళీ అధికారంలోకి రాబోతున్నామన్న ధీమా భారతీయ జనతా పార్టీ అగ్రనేతలలో ఉంది. వారి ధ్యేయమల్లా ఎన్డీఏకి నాలుగొందల పైచిలుకు సీట్లు సాధించి బలమైన పార్టీగా అవతరించడమే.

ఇక, ఒక జాతీయ పార్టీ మరో ప్రాంతీయపార్టీల మధ్య "నారీ నారీ నడుమ మురారిలా" వున్న పవన్ కళ్యాణ్ పార్టీ జనసేన భవిష్యత్తే పశ్నార్థకంగా మారబోతోందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈసారి ప్రజలు ఇవ్వబోయే తీర్పుమీదే చాలామంది రాజకీయ నేతల భవిష్యత్తు ఆధారపడి ఉంది.

ఇంకా ఎన్నికల నోటిఫికేషన్ రాలేదు. ప్రధాన పార్టీలేవీ పూర్తిస్థాయిలో తమ అభ్యర్థులని నిర్ణయించి ప్రకటించలేదు. బీజేపీ –టీడీపీ– జనసేన పొత్తు కుదిరిపోయింది. సీట్ల సర్దుబాటు దాదాపుగా ఒక కొలిక్కి వచ్చింది. అక్కడక్కడా చిన్న చిన్న అభ్యంతరాలు తప్ప పెద్దగా నిరసనలు, ఆందోళనలు లేవు. 'పార్టీని మరింత బలోపేతం చేయడానికి టీడీపీ – జనసేనలతో పొత్తు పెట్టుకున్నాం, కమలనాథులంతా ఆ రెండు పార్టీలకి సహకరించండి' అంటూ బీజేపీ అధిష్టానం పిలుపునిచ్చింది.

రాష్ట్ర భవిష్యత్తు కోసం, పార్టీ పటిష్టత కోసం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవలసి వస్తోంది, పెద్దమనసుతో అర్థం చేసుకుని సంయమనం పాటించి పార్టీ విజయానికి సహకరించాలని తమ పార్టీ నాయకులని, కార్యకర్తలని చంద్రబాబు అభ్యర్థిస్తున్నారు. ఈ గెలుపు మన పార్టీది కాదు, రాష్ట్రానిది అంటూ సెంటుమెంటుని లేవదీస్తున్నారు.

రౌడీల చేతుల్లోనుండి రాష్ట్రానికి విముక్తి కల్పిద్దాం. మన మిత్రపక్షాలైన బీజేపీ – టీడీపీలకి మన ఓట్లు వేసి, రాష్ట్రాన్ని జగన్ విముక్త రాష్ట్రంగా చేసి ఆంధ్రప్రదేశ్‌ని ప్రగతి కాముకులకి అప్పగిద్దాం, కేంద్రంలో మళ్ళీ అధికారంలోకి రానున్న బీజేపీ ద్వారా మన హక్కులు సాధించుకుని ఆంధ్రాని అభివృద్ధి చేసుకుందాం.. అంటూ తన అభిమానులకి, పార్టీ శ్రేణులకు పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ ఆశలు కల్పిస్తున్నారు.

ఆంధ్ర ముఖ్యమంత్రి జగన్ తన ప్రసంగాలలో మహాభారతాన్ని ఉటంకిస్తూ... కౌరవులంతా ఒక పక్క చేరారని అంటున్నారు. తనని పద్మవ్యూహంలో ఇరికించాలని ప్రయత్నిస్తున్నారని చెప్తున్నారు. తాను పాండవ పక్షంలో ఉన్నమాట నిజమే కానీ, వాళ్ళు అనుకుంటున్నట్లుగా తాను అభిమన్యుడిని మాత్రం కాదని, అర్జునుడినని తనకి తానుగానే ప్రకటించుకున్నారు. అందరూ కలిసికట్టుగా వచ్చినా తనని ఏమీ చేయలేరని సవాలు విసురుతూ, సమరానికి "సిద్ధం" అంటూ తన పార్టీ నాయకులు, కార్యకర్తలచేత ఉరకలు వేయిస్తూ కదన రంగంలో దూకడానికి జగన్ సంసిద్ధమవుతున్నారు.

మేము కూడా ఉన్నాం అన్నట్లుగా షర్మిల సారథ్యంలో కాంగ్రెస్‌వర్గాలు, ఉద్యమాలు, పోరాటాలు అంటూ వామపక్షాలూ

10 లో

## ఫలించిన 'సత్య'వాక్కు



ఆంధ్రాలో అధికారంలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై భారతీయ జనతా పార్టీ నుండి రాష్ట్రంలో తొలిసారిగా వ్యతిరేక గళమెత్తిన నాయకుడు సత్య కుమార్. ఆ పార్టీ జాతీయ కార్యదర్శి హోదాలో ఆయన సమయం వచ్చినప్పుడల్లా జగన్‌మోహన్‌రెడ్డిని, ఆయన పార్టీని, ప్రభుత్వాన్ని ఘాటుగా విమర్శిస్తూనే వచ్చారు. బీజేపీతో వైసీపీకి అంతర్గత సంబంధాలు ఉన్నాయని, కమలదళం ఎవరూ జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేయడానికి సాహసించడం లేదని రాజకీయవర్గాలు భావిస్తున్న తరుణంలో సత్యకుమార్ తనదైన తరహాలో స్పందించారు. పలు సందర్భాలలో వైసీపీపైన తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలుచేసి, బీజేపీతో జగన్‌కి సత్సంబంధాలున్నాయన్న అనుమానాలని పటాపంచలు చేశారు. అలా భావించిన రాజకీయవర్గాల వారికి అదంతా వట్టి మాట అన్న సంకేతాన్ని పంపించారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీతో కలసి బీజేపీ పోటీచేయడంతో

10 లో



# బొల్లినేనికి కీలక పదవి

**• టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియామకం**



ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షునిగా నియమితులయ్యారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఈనెల 10న ఆమేరకు ఒక ప్రకటనలో ఆ విషయం పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇటీవల ఢిల్లీలో ఉండగా బొల్లినేని మర్యాద పూర్వకంగా కలుసుకుని ఉదయగిరి నియోజకవర్గ రాజకీయాలను వివరించినట్లు సమాచారం. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ విజయానికి కృషిచేయాలని చంద్రబాబు ఆయనకు సూచించినట్లు తెలుస్తోంది. రానున్న ఎన్నికల్లో బొల్లినేని టిక్కెట్ ఆశించారు. అయితే, తాజా రాజకీయ పరిణామాల్లో ఈసారి ఉదయగిరి టీడీపీ టిక్కెట్ కాకర్ల సురేష్‌కు దక్కింది. దీంతో ఆవేదనలో ఉన్న బొల్లినేనికి తగు ప్రాధాన్యత ఇస్తూ పార్టీలో కీలకపదవిని కట్టబెడుతూ టీడీపీ అధిష్టానం నిర్ణయం తీసుకోవడంతో బొల్లినేని అనుచర వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కాకాణి అరాచక పాలనకు స్వస్తిపలకాలి

**--- మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ---**



సర్వేపల్లి నియోజకవర్గాన్ని అరాచకాలకు నిలయంగా మార్చిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఓడించి ఇంటికి పంపాలని, అక్రమాల పాలనకు ప్రజలు స్వస్తిపలకాలని, పొరపాటున కాకాణికి మరోసారి అవకాశం ఇస్తే సర్వేపల్లిని అమ్మేస్తారని మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఈనెల 12న తోటపల్లిగూడూరు మండలంలోని ఈదూరు గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్ళి ప్రజలను కలిసి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంత్రి కాకాణి అక్రమాలు, అరాచకాలతో సర్వేపల్లిలో అనేకవర్గాల ప్రజలు నానా యాతనలు పడుతున్నారన్నారు. వైకాపా అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని తప్పించేందుకు తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీలు ఒక్కటయ్యాయన్నారు. రాష్ట్రాన్ని మళ్ళీ అభివృద్ధి పథంలో పెట్టాలంటే టీడీపీకి విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, నాయకులు బాబునాయుడు, మనోహర్ గౌడ్, భూపేంద్ర, హరిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని భ్రష్టుపట్టిస్తున్న జగన్

**- పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ధ్వజం**



రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను వైకాపా ముఖ్యమంత్రి జగన్ నీరుగారుస్తూ, రాష్ట్రాన్ని భ్రష్టుపట్టిస్తున్నారని కోవూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇటీవల ఆయన కోవూరులో పార్టీవర్గాలతో మాట్లాడుతూ, తెలుగుదేశం, జనసేన ఎన్డీఏ కూటమిలో చేరడం, భారతీయ జనతాపార్టీతో కలిసి ఎన్నికలకు వెళ్ళడం ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసమేనని, బీజేపీతో కలిసి పోటీ చేయడం సంతోషకరమని, ఈ కలయికను ప్రజలు సంతోషంతో స్వాగతిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి, మాయమాటలతో గెలవాలని చూస్తున్న జగన్ ఆగడాలను అరికట్టాలన్నారు. అందుకు బీజేపీ తోడుకావాలని అంటూ, బీజేపీ టీడీపీ కలిసి పనిచేయడం ఇదేమీ కొత్త కాదని, గతంలో కూడా కలిసి పనిచేశామని, అప్పుడు కూడా మైనారిటీ, బీసీ, దళిత ప్రజల సంక్షేమంలో ఎక్కడా తేడా లేకుండా పనిచేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీకి ఉందని, ఇప్పుడు బీజేపీ జనసేన తెలుగుదేశం కలిసి ఎన్నికల్లో పనిచేయడం శుభ పరిణామమన్నారు. ఈ మూడుపార్టీల కలయికతో ప్రభుత్వం ఏర్పాటు చేయడం రాష్ట్ర భవితకు అవసరమన్నారు. రాష్ట్ర విభజన జరిగిన సమయంలో లోటు బడ్జెట్‌లో ఉన్న ఆంధ్రరాష్ట్ర భవిత కోసం ఇదే కూటమి ఏర్పాటుచేస్తే ప్రజలు స్వాగతించారని, ఇప్పుడు కూడా ప్రజలు తమ కూటమిని గెలిపించి విజయానికి బాటలు వేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు కార్యకర్తలంతా కష్టపడి పనిచేసి రానున్న ఎన్నికల్లో బిజెపి, జనసేన, టీడీపీ కూటమి నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు.

## రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్న..

# వైకాపాను గద్దె దింపేద్దాం

**- బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి**



రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్న వైకాపా ప్రభుత్వాన్ని గద్దె దింపేద్దామని, రానున్న ఎన్నికల్లో ప్రజలు కలసికట్టుగా వైకాపాను ఓడించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. ఇటీవల నెల్లూరులోని కస్తూర్బా గార్డెన్స్‌లో జరిగిన బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆమె మధ్య ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రంలో లక్షలాది కోట్ల రూపాయల అప్పుల భారం పెరిగిందని, పాలనకు ప్రధానమైన సెక్రటేరియట్‌ను కూడా తనఖాపెట్టి అప్పు తెచ్చుకోవడం, రాష్ట్ర సంపదగా ఉన్న గనులను తాకట్టుపెట్టి వేల కోట్లు తీసుకోవడం దారుణమని అన్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు కూడా చెల్లించలేని దుర్గతిలో రాష్ట్రం ఉందంటే పరిస్థితి ఎంత ఘోరంగా తయారైందో ప్రజలు ఆలోచించాలని కోరారు. ఈ అరాచకపు పాలన ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మన బిడ్డలకు, భావితరాల వారికి భవిష్యత్తు ఉండదనే విషయం ప్రతిఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు.

## మోడీ పాలనలోనే ప్రగతి **- శివరాజ్‌సింగ్ చౌహాన్**

ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో దేశం అన్నివిధాలా అభివృద్ధి పథంలో పయనిస్తోందని మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ చెప్పారు. అందుకే ప్రపంచస్థాయిలో కూడా భారతదేశం అన్నిదేశాల వారి నుంచి ప్రశంసలందుకుంటోందని అన్నారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ ఓడిపోతుందని ప్రతిపక్షాలు అనుకున్నా, అక్కడ కూడా బీజేపీని ప్రజలు గెలిపించారన్నారు. అనంతరం బీజేపీ నాయకులు పురందేశ్వరిని, శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను పెద్దఎత్తున పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు శేఖర్‌జీ, జాతీయ కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు వాకాటి నారాయణరెడ్డి, శీపా వంశీధర్‌రెడ్డి, గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలో...

# యువతకు ప్రాధాన్యం

**-మాజీ మంత్రి నారాయణ**



తెలుగుదేశం పార్టీలో యువతకు ప్రాధాన్యత ఉంటుందని మాజీమంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఈనెల 11న ఆయన నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో టీడీపీ నాయకుడు అన్నంగి ప్రసాద్ ఆధ్వర్యంలో 39వ డివిజన్‌కు చెందిన యువత పార్టీలో చేరగా, పార్టీ కండువాలను కప్పి స్వాగతించారు. అనంతరం ఆయన నెల్లూరు నగరంలో పలుప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రం ప్రగతి సాధించాలంటే రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాలన్నారు. రాష్ట్రం బాగు కోసమే టీడీపీ-జనసేన-బీజెపి కలిశాయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ గెలిస్తే, చంద్రబాబునాయుడు నాయకత్వంలో నెల్లూరు నగరాభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ శాసనసభ అభ్యర్థిగా పోటీచేయనున్న తనను నగర ప్రజలు ఆదరించి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బీఎస్పీని గెలిపించండి

సర్వేపల్లి నియోజకవర్గంలో తాను బహుజనసమాజ్(బీఎస్పీ) అభ్యర్థిగా రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, తనను తప్పకుండా గెలిపించాలని అభ్యర్థిస్తూ జానకిప్రసాద్ ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్నారు. ఈనెల12న తోటపల్లి గూడూరు మండలంలోని మల్లికార్జునపురం పంచాయతీలో తమ పార్టీకి చెందిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ, మైనార్టీల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషిచేసే పార్టీ బీఎస్పీయేనన్నారు. డాక్టర్ అంబేద్కర్ ఆశయాలతో సాగే పార్టీ బీఎస్పీ అని, ప్రతిఒక్కరూ తమ పార్టీ విజయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు ఎంబేటి శ్రీనివాసులు, మోచర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తప్పులు చేయొద్దన్నందుకు.. బయటకు పంపారు


**మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



రానున్న ఎన్నికల్లో వైకాపా ఓటమి తథ్యమని, ఆ పార్టీ పతనం కావడం ఖాయమని మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఈనెల 12న ఆయన మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో మాజీ శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని కలుసుకుని జిల్లా రాజకీయాలపై చర్చించారు. ఈ సందర్భంగా రామనారాయణ మాట్లాడుతూ, జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని విమర్శించారు. పాలనలో జరుగుతున్న తప్పులను ఎత్తిచూపినందుకు తనను వైకాపా నుంచి బయటకు పంపారని, తాను అధికారం కోసం పాకులాడడం లేదని, శక్తి ఉన్నంత వరకు జిల్లాలోని మెట్టప్రాంతాల అభివృద్ధికి కృషిచేయాలన్నదే తన ధ్యేయమన్నారు. భవిష్యత్ రాజకీయాల్లో ఇద్దరం కలిసి నడుద్దామంటూ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, రామనారాయణరెడ్డిలు ఈ భేటీలో నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆనం అభిమానులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ నిర్ణయానికి కట్టుబడి ఉందాం

**• జనసేన నగర అధ్యక్షుడు సుజయ్ బాబు**



జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయానికి కట్టుబడి ఉందామని, జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థుల గెలుపు కోసం కృషిచేద్దామని జనసేన నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు చెప్పారు. ఈ నెల 10న ఆయన నెల్లూరులోని జనసేన జిల్లా కార్యాలయంలో సిటీ కమిటీ, డివిజన్ ఇన్‌చార్జిలు, ముఖ్యులతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత ఆయన స్థానిక సమస్యలపై చర్చించారు. నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో జనసేన-టీడీపీ నాయకులను కలుపుకొని ముందుకెళ్లాలని సూచించారు. 'వైకాపా విముక్త ఆంధ్రప్రదేశ్' కోసం, పవన్ కళ్యాణ్ ఆశయ సాధన కోసం అందరం కలిసి పోరాడుదామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి షేక్ ఆలియా, జిల్లా అధికార ప్రతినిధి కలువాయి సుధీర్, నగర ప్రధాన కార్యదర్శులు అజయ్ బాబు, స్థానిక నాయకులతో పాటు నగర నాయకులు పాల్గొన్నారు.

# ఆనం ఆత్మకూరుకే...

## టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగిన రామనారాయణరెడ్డి!



సీనియర్ రాజకీయవేత్త, మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు ఆనం రామనారాయణరెడ్డి పోటీపై సస్పెన్స్ వీడింది. ఆనం ఆత్మకూరు నుండి పోటీ చేయబోతున్నట్లు ఆయనే స్వయంగా ప్రకటించారు. గురువారం తెలుగుదేశం పార్టీ కూడా అధికారికంగా ఆనం పేరును ప్రకటించింది. గత కొన్ని రోజులుగా ఆనం అభ్యర్థిత్వంపై అనేక పుకార్లు షికారు చేస్తూ వచ్చాయి. పార్టీ ఆత్మకూరు నుండి చేయమంటోందని, ఆయన వెంకటగిరి కావాలని కోరుకుంటున్నారని... ఇలా రకరకాల వార్తలు వచ్చాయి. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి వైసీపీ పార్లమెంటు అభ్యర్థిగా ఉన్నప్పుడు ఆయనపై టీడీపీ అభ్యర్థిగా ఆనంని పెడతారన్న వార్త కూడా చక్కర్లు కొట్టింది.

తీరా ఎన్నికలు దగ్గరపడే సమయంలో సీన్ మారింది. ఇప్పుడు వీపీఆర్ తెలుగుదేశానికి వచ్చేశారు. ఆయనే నెల్లూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి కూడా. ఆత్మకూరు నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గంలోకే వస్తుంది కాబట్టి, ఆనం రామనారాయణరెడ్డి కూడా ఆత్మకూరు వైపు మొగ్గు చూపారంటున్నారు ఆనం అభిమానులు. ఆనం కుటుంబానికి ఆత్మకూరుతో చిరకాల అనుబంధం ఉంది. 1958-67 మధ్యకాలంలో 9 సంవత్సరాల పాటు రామనారాయణరెడ్డి సోదరుడు ఆనం సంజీవరెడ్డి ఇక్కడ శాసనసభ్యులుగా ఉన్నారు. 1985 - 87 మధ్యకాలంలో రామనారాయణరెడ్డి తండ్రి ఆనం వెంకటరెడ్డి ఏం.ఎల్.ఏగా తమ సేవలు అందించారు. వారిద్దరి తరువాత మళ్ళీ 22 ఏళ్ళ అనంతరం 2009 లో ఆత్మకూరులో రామనారాయణరెడ్డి శాసనసభ్యుడిగా విజయం సాధించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆర్థికశాఖామాత్యుడిగా దాదాపుగా 3500 కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలని ఆత్మకూరు నియోజకవర్గానికి ఆనం మంజూరు చేయించారు. వాటిలో 2014 నాటికి 60 శాతం పనులు పూర్తి కాగా, ఆ తరువాత 2014 ఎన్నికలలో ప్రభుత్వం మారడంతో మిగిలిన పనులు ఆగిపోయాయి. ఆత్మకూరు నియోజకవర్గంలో అంతటి స్థాయిలో పనులు చేయించినా, రాష్ట్రాన్ని ముక్కలు చేసిందన్న కారణంగా కాంగ్రెస్‌పై ప్రజలు చూపించిన వ్యతిరేకతతో ఆ ఎన్నికలలో రామనారాయణరెడ్డి ఓడిపోయారు. ఆనం తెలుగుదేశం నుండి పోటీచేసి ఉంటే, ఆత్మకూరులో ఆయన గెలవడంతోపాటు అప్పటి టీడీపీ నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి ఆదాల ప్రభాకరరెడ్డి కూడా విజయం సాధించి ఉండేవారన్న చర్చ ఆ సమయంలో రాజకీయవర్గాలలో బాగా సాగింది. మళ్ళీ పదేళ్ళ తరువాత ఆనం ఆత్మకూరు నుండి బరిలో దిగబోతుండడంతో ఆనం అభిమాన వర్గాలు సంబరపడుతున్నాయి.

### కోవూరు టీడీపీ అభ్యర్థిగా..

# వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేరు ఖరారు!



నెల్లూరుజిల్లా రాజకీయం కొద్ది రోజులుగా కోవూరు నియోజకవర్గం చుట్టూ తిరిగింది. కోవూరు నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేయబోయేది ఎవరన్న ప్రశ్న రాజకీయవర్గాల్లో జోరుగా సాగింది. చివరికి రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణి ప్రశాంతిరెడ్డి పేరుని టీడీపీ అధిష్టానం గురువారం ఖరారు చేసింది. వైసీపీ నుండి సిట్టింగ్ ఎంఎల్ఏ ప్రసన్నకుమార్‌రెడ్డి బరిలో ఉంటారన్న సంగతి తెలిసిందే. అయితే, ఇక్కడ టీడీపీ అభ్యర్థి విషయంలోనే గురువారం వరకు సస్పెన్స్ కొనసాగింది .

గత ఇరవై ఏళ్ళుగా ఈ నియోజకవర్గాన్ని మాజీ శాసనసభ్యుడు పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డి కనిపెట్టుకుని ఉన్నారు. దివంగత నేత డాక్టర్ రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో 2004లో ఆయన కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా తొలిసారి ప్రత్యక్ష ఎన్నికలలో పోటీచేసి అతి తక్కువ మెజారిటీతో ఆనాడు టీడీపీ నుండి పోటీచేసిన ప్రసన్నపై విజయం సాధించారు. పోలంరెడ్డిని జెయింట్ కిల్లర్ అని అప్పట్లో రాజశేఖరరెడ్డి ప్రశంసించారు కూడా.

ఆ తరువాత 2009లో టీడీపీ నుండి, 2012 ఉప ఎన్నికలలో వైసీపీ నుండి పోటీచేసిన ప్రసన్నకుమార్‌రెడ్డి చేతిలో పోలంరెడ్డి వరుసగా రెండుసార్లు ఓటమి పాలయ్యారు. మళ్ళీ 2014లో టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగి, ప్రసన్నపై విజయం సాధించారు. 2019లో మళ్ళీ ప్రసన్న చేతిలో


12లో

# పోయేటప్పుడు బిరియానీ... వచ్చేటప్పుడు పులిహోర!

**• ఇదీ పార్టీల తంతు!**

మొన్న మార్చి 10వతేదీ ప్రకాశం జిల్లాలో మేదరమెట్ల వద్ద జరిగిన వైసీపీ "సిద్ధం" సభకి నెల్లూరుజిల్లా నుండి 450 బస్సులు వెళ్లాయని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఆరోజు ఉదయం బస్సు బయలుదేరే సమయానికి తమకి ఒక క్వార్టర్ బాటిల్, ఒక వాటర్ బాటిల్ అవి రెండూ కలుపుకోవడానికి ఒక గ్లాసు, వాటితో పాటు ఒక బిరియాని పొట్లం ఇచ్చారని బస్సెక్కిన వాళ్ళు చెప్తున్నారు. వీటితో పాటుగా కొన్ని నియోజకవర్గాల్లో మనిషికి 500, మరికొన్ని దగ్గర్ల 300 క్యాష్ కూడా కొట్టారని చెప్తున్నారు. అయితే వాళ్ళ బాధల్లా ఒక్కటే. సమావేశానికి తీసుకెళ్ళేటప్పుడు మాత్రం రాజమర్యాదలతో అన్ని సౌకర్యాలు కల్పించి మరీ బస్సెక్కించారు, తీరా సభ ముగిశాక తమని పట్టించుకున్న నాధుడే లేడని వాపోతున్నారు. భయంకరమైన ట్రాఫిక్‌జామ్‌లో చిక్కుకొని ఎప్పుడో పక్క రోజు తెల్లవారుఝామున చాలామంది తమ గ్రామాలలో ఇళ్ళకి చేరారంట. పైగా పొద్దున ఇచ్చిన క్వార్టరు, వాటరు, బిరియాని సభకి వెళ్ళేలోపలే ఐపోయాయంట. రాత్రి తిరిగొచ్చేప్పుడు ఒక పులిహోర పొట్లం చేతిలో పెట్టారని అంటున్నారు.

అది ఏ రాజకీయపార్టీ అయినా ఇంతే అన్న సంగతి ప్రజలు తెలుసుకోవాలి. ఎన్నికలకి ముందు బిరియానీ లాంటి వాగ్దానాలు ఇస్తారు, ఎన్నికల తరువాత పులిహోర కలిపి పస్తులతో మోత మోగిస్తారు. ప్రజల పట్ల పార్టీలు, నాయకులూ వ్యవహరించే తీరుకి ఇంతకంటే ఇంకేం నిదర్శనం కావాలి. మరి మన జనం ఎప్పటికి మేలుకుంటారో... ఈ స్వార్థపూరిత నాయకులిచ్చే పాకులనుండి ఎప్పుడు కోలుకుంటారో!



లాయర్
మార్చి 15, 2024

# సీఏఏ చట్టం అమలు.. సాహసోపేతమే!

ఎన్నికల సమయం దగ్గరపడుతున్న సమయంలో ప్రధాన పార్టీల వారు బహుజాగ్రత్తగా ఉంటారు. ఆచితూచి అడుగులు వేస్తుంటారు. వివాదాస్పద విషయాలకు పోకుండా అప్రమత్తంగా ఉంటారు. ఎన్నికల వేళ.. ఏ మాట చెప్తే ఏమవుతుందోననే ఆందోళన ఉంటుంది. కానీ, అధికారంలో ఉన్న బీజేపీ మాత్రం తానేది మంచి అని అనుకుంటున్నదో దానిని ధైర్యంగా చేసేసుకుంటూ ముందుకు సాగిపోతోంది. అలాంటి సాహసోపేత ధోరణికి నిదర్శనమే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ). 2019లో పార్లమెంటు ఆమోదించిన ఈ వివాదాస్పద చట్టాన్ని ఇప్పుడు ఎన్నికలొస్తున్న తరుణంలో ఉన్నట్లుండి తెరమీదకి తీసుకురావడం, ఆ మేరకు హోం మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ కూడా ఇచ్చేయడంతో వెనువెంటనే ఈ చట్టం అమలులోకి వచ్చినట్లయింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌లో మత మైనారిటీలుగా హింసకు గురై, ఎలాంటి పత్రాలు లేకుండా 2014 డిసెంబరుకు ముందు మనదేశానికి వలసవచ్చిన ముస్లిమేతరులకు మనదేశ పౌరసత్వం ఇచ్చే చట్టం ఇది. ఆ దేశాల నుంచి మనదేశానికి వచ్చిన వారిలో ముస్లింలు మినహా మిగతా మతాల వారికి, హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీలు, క్రైస్తవులకు ఈ చట్టం కింద భారత పౌరసత్వం ఇస్తారు. ఆ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో సిద్ధం చేశారు కూడా. ఆమేరకు దరఖాస్తు చేసుకునేవారికి ఎలాంటి పత్రాలు అడగబోమని కూడా హోంశాఖ అధికార ప్రతినిధి స్పష్టం చేస్తున్నారు. వాస్తవానికి ఈ చట్టాన్ని సార్వత్రిక ఎన్నికలకు ముందే అమలుచేస్తామని బీజేపీ నేతలు పదేపదే ప్రకటించి ఉన్నారు కూడా. అలా అనుకున్నట్టే దాని అమలుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. అయితే, ఇది కొందరి పట్ల వివక్ష చూపేదిగా ఉందంటూ విపక్షాలు ఆగం చేస్తున్నాయి. రాజకీయ కారణాలతో ఈ చట్టాన్ని అమలుచేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామంటూ విమర్శిస్తున్నాయి కూడా. ఎన్నికల బాండ్ల వ్యవహారం నుంచి ప్రజల దృష్టి మళ్ళించడానికి ప్రధాని మోడీ ప్రభుత్వం ఈ చట్టాన్ని హడావుడిగా తెచ్చిందని ఆరోపిస్తున్నాయి. గతంలో ఈ సవరణ చట్టం తేవాలనుకున్న సందర్భంలో మత ఘర్షణలు చెలరేగడంతో దానిని అప్పట్లో పక్కనపెట్టేశారు. ఇప్పుడు ఈ చట్టం అమలు చేయడం వల్ల అల్లర్లు జరుగుతాయన్న అనుమానంతో పలు రాష్ట్రాల్లో భద్రతాచర్యలను కట్టుదిట్టం చేశారు. ఈ చట్టం వల్ల పాక్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుంచి పునరావాసానికి, లేదా పౌరసత్వం కోసం వచ్చినవారికి చట్టపరంగా ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని, ఏళ్లతరబడి కాందిశీకుల్లా బతుకుతున్న వారికి గౌరవప్రదమైన జీవితం లభిస్తుందని, అందువల్ల ఈ చట్టం వారికెంతో ప్రయోజనకరమని కేంద్రం చెప్తోంది. దీంతో ముస్లిమేతర శరణార్థులకు మేలు కలుగుతుంది కనుక ఆ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. ఇది దేశ సమగ్రతకు విఘాతమని ప్రతిపక్షాలు అంటున్నాయి. అంతేకాదు, ఎన్నికల లబ్ధికోసమే ఈ చట్టాన్ని తెచ్చారని కూడా కేంద్రంపై విమర్శనా బాణాలు సంధిస్తున్నాయి. ఇదొక ఎన్నికల స్టంట్ అని మమతా బెనర్జీ విమర్శించారు. తమ రాష్ట్రాల్లో ఆ చట్టాన్ని అసలు అమలు చేయబోమని పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాల ముఖ్యమంత్రులు మమతాబెనర్జీ, పినరయి విజయన్‌లు తెగేసి మరీ చెప్తున్నారు. అస్సాంతో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో దీని వల్ల అలజడిగా ఉంది. ఒక వర్గాన్ని ఏకీకృతం చేసేందుకే సరిగ్గా లోక్‌సభ ఎన్నికలకు ముందు మోడీ ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీచేసిందంటూ కాంగ్రెస్‌తో పాటు పలు పార్టీలు ఆగ్రహంగా ఉన్నాయి. అయితే, ఈ చట్టం అమలు వల్ల భారత్‌లోని ముస్లిమ్‌లు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, హిందువులతో సమానంగా వారి హక్కులకు రక్షణ ఉంటుందని కేంద్ర హోంశాఖ స్పష్టం చేస్తోంది. పాక్, ఆఫ్ఘన్, బంగ్లాదేశ్‌లలో మైనార్టీలు హింసలకు గురవుతుండం వల్ల ఈ చట్టం ద్వారా కాందిశీకులకు రక్షణ కల్పించడం, ఆ మూడు దేశాల్లో అణచివేతకు గురవుతూ భారత్‌కు తప్ప వేరే ఏ దేశానికీ వెళ్ళలేని ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పించడం మంచిదేననే అభిప్రాయాలు అధికారపక్షంలో ఉన్నాయి. మొత్తమ్మీద ఈ చట్టంద్వారా కాందిశీకుల రక్షణే ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ చట్టాన్ని అమలుచేయడం ద్వారా బీజేపీ ప్రభుత్వం నాటి ఎన్నికల హామీని నెరవేర్చిందని బీజేపీ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. ఏదేమైనా, హింసతో బాధపడుతున్న మానవాళి సంక్షేమం కోసం ఈ సవరణ చట్టాన్ని రూపొందించడం చరిత్రాత్మకమైన విషయమే. అంతేకాదు ఇక రేపోమాపో ఎన్నికలకు దండోరా మోగనుందనుకుంటున్న సమయంలో, ఇలాంటి క్లిష్టతరమైన చట్టాలను అమలు చేయడం ధీరోదాత్తమైన చర్య అనే చెప్పవచ్చు.




## మనల్ని మనమే అమ్ముకుంటున్నామా?

నోట్ల కోసం మనల్ని మనమే అమ్ముకుంటున్నామా..? సంతలో పశువుల్లా మారి రాజకీయ నాయకుల స్వార్థానికి బలైపోతున్నామా..?? పథకాల పేరుతో, ఉచితాల సాకుతో ఓటర్లని మైమరపించి రాజకీయ పార్టీలు, నాయకులు తమ పబ్బం గడుపుకుంటున్నారా..???

ఒక్క మన రాష్ట్రంలోనే కాదు, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఇప్పడివే ప్రశ్నలు వినపడుతున్నాయి. రాజకీయవర్గాలతో పాటు జనంలో కూడా ఇప్పుడు ఇలాంటి చర్చే జోరుగా సాగుతోంది. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఏ నోట చూసినా ఇదే మాట. ఓ వైపు ఈ చర్చ సాగుతుండగానే మరోవైపు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీల నుంచీ ఉచిత పథకాలు, హామీల వరద జనంలోకి ప్రవహిస్తూనే ఉంది. అటు అధికారపక్షాలతో పాటు ప్రతిపక్షాలు కూడా ఓట్ల కోసం పాట్లు పడుతూ ఉచితాల దారినే నమ్ముకుంటున్నాయి. ఓట్లకోసం ఓట్లనే ఎర చూపడానికి సిద్ధపడుతున్నాయి.

గతంలో పరిస్థితి ఇలా ఉండేది కాదు. ఎవరో కొంతమంది ఆర్థిక స్తోమత కలిగిన నాయకులు మాత్రం ఎన్నికలప్పుడు, తమ అనుచరులను ఓటర్ల ఇళ్లకు పంపి రహస్యంగా డబ్బు పంపిణీ చేసేవారు. ఎన్నికల తంతు ముగిశాక మళ్ళీ జనం మొఖం చూసేవారు కాదు. ఇప్పుడలా కాదు, ఎన్నికలు రాకముందు నుంచే ఏదో ఒక పథకం పేరుతో అధికార పార్టీలే లక్షల కోట్లు ప్రజల ఖాతాలలోకి నేరుగా వేసేస్తున్నాయి.

ముఖ్యంగా మన ఆంధ్ర ప్రభుత్వం ఈ పంపకాలలో దేశంలోని ఇతర రాష్ట్రాలకి ఆదర్శంగా నిలచింది. “భారతదేశంలోనే ఇప్పటివరకూ ఏ పార్టీ లేదా నాయకుడు చేయని ప్రయత్నం, ప్రయోగం తొలిసారిగా మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేశారు.” అని మాజీ ఎంపీ, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ఉండవల్లి అరుణ్‌కుమార్ పలు సందర్భాలలో చెప్పారు. అలా అని ఆ పథకాలు అందుకున్న ఓటర్లు ఎన్నికలప్పుడు అధికార పార్టీ అభ్యర్థుల నుండి ఒక్క రూపాయి కూడా ఆశించకుండా ఓటేస్తున్నారా అంటే అదీ లేదు. పోలింగుకి ముందే తమ చేతిలో పడాల్సింది పడితే తప్ప పోలింగ్‌బూత్‌ల వైపుకు కూడా వెళ్లడంలేదు. అధికార పార్టీ ఉచిత పథకాల పేరుతో లక్షల కోట్లు డబ్బు పంపకం చేస్తున్న కారణంగా రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందన్నది మేధావుల వాదన. ప్రస్తుతం ఆంధ్రాలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా వుంది. పరిశ్రమలు ఆశించిన స్థాయిలో రాలేదు. నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాలకు బ్రేకులు పడ్డాయి. పనులు చేసిన కాంట్రాక్టర్లకి బిల్లులు రాలేదు. కొత్తగా పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకి రావడంలేదు. మౌలిక వసతుల కల్పన అటకెక్కింది. ప్రభుత్వ ఉద్యోగులకి జీతాలు సమయానికి అందడంలేదు. ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపులు పెండింగులో ఉన్నాయి. ఫీజు రీఎంబర్స్ మెంటుకి సంబంధించి విద్యాసంస్థలకి ప్రభుత్వం కోట్లరూపాయల బకాయిలు చెల్లించాల్సి వుంది. ఇలా చెప్పుకుంటూ పోతే అసలు ప్రభుత్వం దృష్టి పెట్టని అనేక రంగాలు ఎదుగు బొదుగూ లేకుండా దీనావస్థలో ఉన్నాయంటున్నారు మేధావులు.

### డబ్బులన్నీ పంచేస్తే... మరి అభివృద్ధో?

అధికారంలో ఉన్న పార్టీలు అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని, ఆయా ప్రాంతాల అభివృద్ధిని చూడకుండా, ఓట్ల కోసం ఉన్న డబ్బునంతా ఏ కొన్ని వర్గాలవారికో ‘ఉచితాలు’గా పంచేస్తే ఇక అభివృద్ధి ఎక్కడ...? అన్నది మేధావి వర్గాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ప్రజలు కట్టే పన్నుల ద్వారా ప్రభుత్వాలకి వస్తున్న కోట్లాదిరూపాయలను, అదేదో తమ సొంత సొత్తయినట్లుగా ఇష్టం వచ్చినట్లు పంచేస్తే అభివృద్ధికి నిధులు ఎలా వస్తాయి? అన్నదే ప్రధాన ప్రశ్న. నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కూడా అనేక ఉచితాలను ప్రకటించింది. వాటిని అమలు చేసి ఇప్పుడు ముమ్మరంగా ప్రచారం కూడా చేసుకుంటోంది. అదే సమయంలో దేశంలో అభివృద్ధికి కూడా ఎక్కడా విఘాతం కలుగకుండా ప్రగతిని పరుగులు తీయిస్తోంది. మోడీ కూడా అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు వంటి అంశాలని పక్కనపెట్టి పూర్తిగా ఉచితాలనే నమ్ముకుని ఉంటే పరిస్థితి మరోలా ఉండేది.

ఏదేమైనా, పాలకపక్షం కావచ్చు, లేదా ప్రతిపక్షం కావచ్చు, నాయకులెవరైనా సరే, ఏ పార్టీ వారైనా సరే.. అభివృద్ధిని మరచిపోయి, ఉచితాల పేరుతో అనుచిత విధానాలను అనుసరించడం శ్రేయస్కరం కాదనే మాట మాత్రం విద్యావంతులు, మేధావుల నుండి వినిపిస్తోంది. ప్రజలు మంచి - చెడులని గమనించుకుని, ఆలోచనతో విజ్ఞతతో ఓట్లు వేయాలే తప్ప, కులమతాలని, ఉచిత తాయిలాలని, ఎన్నికలప్పుడు నాయకులు విదిలించే చిల్లరని చూసి ఓటేయడం ప్రజాస్వామ్యానికే చేటు. నోట్లని నమ్ముకుంటున్నాం, మనల్ని మనమే అమ్ముకుంటున్నాం. ఎలాంటి వత్తిళ్లకు, ప్రలోభాలకు లొంగకుండా ఓటే ఆయుధంగా ప్రజాస్వామ్యాన్ని గౌరవప్రదంగా, సగర్వంగా నిలబెట్టుకోవాల్సిన బాధ్యతను ఎవరూ విస్మరించకూడదు. అప్పుడే దేశం బాగుంటుంది. దేశం బాగుంటే మన కుటుంబం బాగుంటుంది. మన కుటుంబం బాగుంటే మన పిల్లలు బాగుంటారు. మన పిల్లలు బాగుంటే మళ్ళీ మన దేశం పురోగతి వైపు పరుగులు పెడుతుంది. ఈ సత్యాన్ని అందరూ గ్రహించాలి. ప్రతిఒక్కరూ అలోచించి ఓటెయ్యాలి. అభివృద్ధికి, సంక్షేమానికి, నిబద్ధతకు నమ్మకానికి ఓటెయ్యాలి. జై హింద్!

- రాజశ్రీ

## వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి బీజేపీలో చేరుండాల్సింది!

అపర దానకర్ణుడు, ఆధ్యాత్మిక చింతనాతత్పరుడు, సేవా పిపాసకుడు, మంచివాడు, వివాదరహితుడు, అజాతశత్రువుగా గుర్తింపు పొందినవాడు, మన నెల్లూరు జిల్లా గర్వించదగిన వ్యక్తి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి. ఆయన చేపట్టే సేవా కార్యక్రమాల కొరకు రాజకీయాలను వేదిక చేసుకోవడం సముచిత నిర్ణయమే. తన రాజకీయ ప్రయాణం కోసం ఇన్నాళ్లూ వైసీపీలో కొనసాగిన ఆయన, ఇప్పుడు మనస్తాపంతో ఆ పార్టీని వీడడం ఆయన వ్యక్తిగతం. అయితే, ఆయన తమ భవిష్యత్ రాజకీయ కార్యక్రమాలకు తెలుగు దేశాన్ని కాకుండా బీజేపీని వేదికగా ఎంచుకుని ఉంటే బాగుండేది. వీపీఆర్ లాంటి వ్యక్తిది ఇలాంటి బజారుస్థాయి రాజకీయాలు చేసే పార్టీలలో చేరే స్థాయి కాదు. జగన్‌మోహన్ రెడ్డి పార్టీలో కీలకవ్యక్తిగా చక్రం తిప్పిన ప్రభాకరరెడ్డికి టీడీపీలో ఆ స్థాయి గౌరవం లభిస్తుందని నేననుకోను. బీజేపీలో చేరివుంటే ఆ పార్టీ అన్ని విధాలుగా ఆయనకి సముచిత స్థానం కల్పించి ఉండేది. బీజేపీలో ఉన్నతస్థాయికి ఎదగడానికి కావలసిన అన్ని అర్హతలు వేమిరెడ్డికి వున్నాయన్నది నా అభిప్రాయం.

– ఆర్. దామోదరరెడ్డి, హైదరాబాదు.

## చెత్తాచెదారంతో నిండిపోతున్న మైపాడు బీచ్!

నెల్లూరుజిల్లాలో అత్యంత ప్రాచుర్యం పొందిన విహార కేంద్రం మైపాడు బీచ్. దివంగత పెద్దాయన ఆల్తూరు ఆదినారాయణరెడ్డి చొరవతో ఇక్కడ ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనా ఆలయాలు కూడా నిర్మింపబడి ఈ తీరం ఆధ్యాత్మికంగా కూడా ప్రాముఖ్యత సంతరించుకుంది. ముఖ్యంగా శని, ఆదివారాల్లో ఇక్కడకి వేలాదిమంది సందర్శకులు, భక్తులు వస్తుంటారు. ఇదే ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ టూరిజంశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడిన హరిత రిసార్టు ఉంది. ప్రస్తుతం ఆ మైపాడు బీచ్‌లో పరిస్థితి అధ్వానంగా తయారయ్యింది. టూరిజం హోటల్ శిధిలావస్థకి చేరి దీనంగా దర్శనమిస్తోంది. బీచ్ కూడా దుర్గంధ భూయిష్టంగా మారింది. అక్కడకి వస్తున్న సందర్శకులు తాము తెచ్చుకున్న ఆహారపదార్థాల కవర్లని, ఖాళీ ప్లాస్టిక్ డబ్బాలని, మంచినీళ్ళ సీసాలని సముద్రపు ఒడ్డున పడేస్తున్నారు. మొత్తం బీచ్ ప్రాంతమంతా కంపు కంపుగా తయారయ్యింది. అధికారులు చొరవ చూపకపోతే జిల్లాల్లో ఆహ్లాద యాత్రా స్థలంగా దశాబ్దాలుగా ప్రసిద్ధిచెందిన మైపాడు బీచ్ కూడా ప్రజలకి దూరమైపోతుంది. రాజకీయ నేతలు, అధికారులు పట్టించుకోవాలని వినతి.

– ఎం. శ్రీనివాసులరెడ్డి, లేబూరు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

## ఫిరాయింపులు మాములేగా!

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పలు పార్టీల నాయకులు ఇతర పార్టీలలోకి మారుతున్న వార్తలు రోజూ వస్తూనే వున్నాయి. అలా మారుతున్న నాయకులపైన కొంతమంది విమర్శలు చేయడం హాస్యాస్పదంగా వుంది. ఇలా ప్రతిసారీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో నేతలు పార్టీలు ఫిరాయించడం మాములే కదా! ఇంతమాత్రానికి ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడం అర్థరహితం. ఒకప్పుడు నామినేషన్లు వేసే దాకే ఈ మారటాలు ఉండేవి, ఇప్పుడు ఒక పార్టీ తరపున నామినేషన్ వేసినవారు ఉపసంహరణ గడువు దాకా ఆ పార్టీలోనే వుంటారో లేదో కూడా చెప్పడం కష్టమే!

యు. విశ్వేశ్వరరావు, హైదరాబాదు.




# చంద్రబాబును సీఎంగా గెలిపించుకోవాలి

## తెలుగుదేశం నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వీపీఆర్ పిలుపు

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి విజయం చేకూర్చాలని, చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని తెలుగుదేశం ఎంపీ అభ్యర్థి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలోని రంగనాయకుల పేటలో ఉన్న రాఘవ కల్యాణ మండపంలో ఇటీవల నిర్వహించిన 49, 50 డివిజన్లలోని టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన.. మాజీమంత్రి పొంగూరు నారాయణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు,కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరు నగరంలో నారాయణ చాలా అభివృద్ధి పనులు చేశారని, ఆయన చేసిన అభివృద్ధే నేటికీ నిలిచి ఉందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో నారాయణను ఎమ్మెల్యేగా, తనను ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. అందరి లక్ష్యం ఒకటేనని, నారా చంద్రబాబు నాయుడుని సీఎంను చేసుకోవాల్సి ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ టీడీపీకే ఓటు వేయాలని ఆయన కోరారు. అనంతరం ఆయన పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకురాలు తాళ్లపాక అనురాధ, నాయకులు కప్పిర శ్రీనివాసులు, రేవతి, రూప్‌కుమార్‌యాదవ్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, జనసేన నాయకులు గునుకుల కిషోర్, ధర్మవరపు సుబ్బారావు, దొడ్డపనేని రాజానాయుడు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

### బీద రవిచంద్ర, అజీజ్‌లతో వీపీఆర్ భేటీ :

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో, నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌తో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల వారి నివాసాల్లో భేటీ అయ్యారు. స్థానిక మాగుంట లేఅవుట్‌లోని బీద రవిచంద్ర నివాసానికి వచ్చిన వీపీఆర్‌ను రవిచంద్ర స్వాగతించి శాలువాతో సత్కరించారు. అనంతరం పలు అంశాలపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, నెల్లూరు నగర డెప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. అదేవిధంగా నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌తో హరినాధపురంలోని ఆయన నివాసంలో వీపీఆర్ కలిసి జిల్లా రాజకీయాలను చర్చించారు. ఈ సందర్భంగా అజీజ్ వీపీఆర్‌ను ఆత్మీయంగా స్వాగతించి సన్మానించారు.

## ఆగ్రా మెట్రోస్టేషన్ నిర్మాణంలో..

# శ్రీసిటీ-హంటర్ డగ్లస్ సంస్థ కీలకపాత్ర



ఆగ్రా మెట్రోస్టేషన్ నిర్మాణంలో..శ్రీసిటీ–హంటర్ డగ్లస్ సంస్థ కీలకపాత్ర పోషించి అందరి ప్రశంసలందుకుంటోంది. ఇటీవల ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రారంభించిన ఆగ్రాలోని నూతన తాజ్‌మహల్ మెట్రోస్టేషన్ రూపకల్పన, చేయడంలోనూ, దాని నిర్మాణంలోనూ శ్రీసిటీలోని హంటర్ డగ్లస్ పరిశ్రమ తన ప్రత్యేకత చాటుకుంది. ప్రయాణీకులకు ఆకర్షణీయంగా, ధ్వని ప్రశాంతత ఉండేలా కంపెనీ వినూత్న ఉత్పత్తులైన ఉడ్–ఫినిష్ మెటల్ బేఫిల్స్, లీనియర్ మెటల్ సీలింగ్‌లను ఇందులో వినియోగించడం విశేషం. శ్రీసిటీలోని తమ అధునాతనప్లాంట్ నుంచి, సంస్థ ప్రత్యేక ఉత్పత్తులలో ప్రముఖమైన లక్సలోన్ వుడ్ ఫినిషింగ్ రోల్–ఫార్మేడ్ మెటల్ బ్యాఫిల్‌ను 10,000 చదరపు మీటర్ల విస్తీర్ణానికి సరిపడా హంటర్ డగ్లస్ సరఫరా చేసింది. అదనంగా 3500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో లక్స్‌లోన్ 300 సి–లీనియర్ రోల్–ఫార్మేడ్ మెటల్ సీలింగ్ సమకూర్చడం ద్వారా స్టేషన్ నిర్మాణానికి మరింత వన్నెతెచ్చింది. నాగపూర్, పూణే, ముంబై, అహ్మదాబాద్, నవీ ముంబై, బెంగళూరు, చెన్నై, జైపూర్, ఢిల్లీ, కాన్పూర్, కోల్‌కతా, ఆగ్రాతో సహా భారతదేశం అంతటా ప్రధాన మెట్రోస్టేషన్‌లను రూపొందించడంలో విశ్వసనీయ భాగస్వామిగా తమ కంపెనీ పాత్ర గురించి హంటర్ డగ్లస్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ పి.కె సుందరమూర్తి వివరించారు. వివిధ నగరాల్లో వినూత్నమైన, నాణ్యమైన నిర్మాణ పరిష్కారాలను అందించడంలో హంటర్ డగ్లస్ ఖ్యాతి గడించినందుకు గర్వంగా ఉందన్నారు. ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు హంటర్ డగ్లస్ అందిస్తున్న సహకారాన్ని ఇటీవల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రశంసించారు. వివిధ మెట్రో స్టేషన్‌లను అధునాతన ఆకృతులతో అద్భుతంగా తీర్చిదిద్దిన సంస్థ సిబ్బంది పనితీరును ఆయన ప్రత్యేకించి అభినందించారు. విండోబ్లైండ్‌లు, రోలర్‌షేడ్స్, తమెటల్ సీలింగ్‌లు, క్లాడింగ్‌లు, సన్‌షేడ్ వంటి వివిధ ఉత్పత్తులను హంటర్ డగ్లస్ వంటి ఉత్పత్తులతో ఆధునిక విమానాశ్రయాలు, మెట్రో స్టేషన్ల అవసరాలను తీర్చడంలో హంటర్ డగ్లస్ సంస్థ తన ప్రతిభను, నిబద్ధతను చాటుతుండడం గర్వకారణం. గతంలో పంజాబ్‌లోని అంబాలా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో రాఫెల్ ఫైటర్ జెట్ హ్యాంగర్, ప్రపంచంలోనే అతిపెద్ద కార్యాలయ సముదాయమైన సూరత్ డైమండ్ బోర్స్ ప్రాజెక్టులకు కూడా ఆ సంస్థ తన భాగస్వామ్యాన్ని అందించింది.





# క్రీడాకారులకు.. క్రికెట్ కిట్లు పంపిణీ

వైకాపా నాయకులు క్రీడాకారులకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. నెల్లూరు టౌన్‌హాలులో ఈనెల 13న జరిగిన ఈ కార్యక్రమానికి నెల్లూరు పార్లమెంట్ వైకాపా అభ్యర్థి విజయసాయిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని 35 క్రీడాజట్లకు ప్రోత్సాహకంగా క్రీడాకిట్‌లు పంపిణీ చేశారు. క్రీడాకారులను అభినందించి..వారు క్రీడల్లో మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని అయన ఆకాంక్షించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త ఆదాల ప్రభాకర్ రెడ్డి, ఎంపీ బీదా మస్తాన్‌రావు, జిల్లా వైకాపా అధ్యక్షులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఖలీల్‌అహ్మద్, క్రికెట్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

## 'నరసం' నేతృత్వంలో..
# మహిళా దినోత్సవం



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 9న నెల్లూరులోని నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం(నరసం) ఆధ్వర్యంలో మినీ బైపాస్‌లోని మొక్కల నర్సరీలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభా పాటవాలు ఉన్న వారికి నరసం-నెల్లూరు శాఖ అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శారదా స్కూల్ అధినేత కృష్ణవేణి, ప్రముఖ రచయిత్రి సుధా మురళి, ప్రముఖ గాయని చేజర్ల వినయ, డాక్టర్ శైలజా ఏకాంబరం తదితరులు ఈ సన్మానాలను అందుకున్నారు. రచయిత్రులు సందడి అరుణ, నజ్మ, గాయత్రి, డాక్టర్ సుహాసిని, భారతి, ప్రసన్నలక్ష్మి, సుందరి, లలిత, ఇందిర, వత్సల తదితరులు పాల్గొన్నారు. ఆటలు పాటలు, సందేశాత్మక ప్రసంగాలతో ఈ కార్యక్రమం సందడిగా జరిగింది.

# నెల్లూరు కబుర్లు

# పీఏ కుటుంబానికి చేయూత

## సీఎం రిలీఫ్ కింద రూ. 10 లక్షలు అందజేత



ఇటీవల ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి జరిగిన రోడ్డు ప్రమాదంలో, అదే కారులో ప్రయాణిస్తూ గాయపడి మరణించిన ఎమ్మెల్సీ పీఏ వెంకటేశ్వర్లు సతీమణికి సీఎం రిలీఫ్ పండ్ కింద 10 లక్షల రూపాయలు మంజూరైంది. ఆ చెక్కును ఇటీవల వెంకటేశ్వర్లు సతీమణికి పర్వతరెడ్డి అందజేశారు. ఇప్పటికే వెంకటేశ్వర్లు కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద 5 లక్షల రూపాయలను అందజేసివున్నారు కూడా. అదేకాక, ఇతరత్రా కూడా మృతుని కుటుంబానికి సాయం చేయాలని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి కృషిచేస్తున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డికి వెంకటేశ్వర్లు సతీమణి కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళల సేవలు మహోన్నతం



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో 203-వాకర్స్ గవర్నర్ పలగాటి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులు పాల్గొని సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంత గొప్పదో వివరించారు. అనంతరం, పలు రంగాల్లో ఉత్తమసేవలందిస్తున్న 30 మంది మహిళలను ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ వాకర్స్ అసోసియేషన్ కోఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యానాయుడు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామమోహన్‌రెడ్డి, కార్యదర్శి షేక్ నజీర్ అహమ్మద్, కోశాధికారి సుబ్బరాయుడు, వాకర్స్ ప్రతినిధులు ఏకొల్లు రాఘవరెడ్డి, భారతి, సుధాకర్‌రెడ్డి, సోను, వినుకొండ వెంకటేశ్వర్లు, ప్రసాద్‌నాయుడు, సురేష్, పత్తిపాటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# నీటిపారుదల శాఖలో అక్రమాలు

## రూ. కోట్లు తినేస్తున్నారంటూ సోమిరెడ్డి ధ్వజం



జిల్లా నీటిపారుదల శాఖ అక్రమాలకు అడ్డాగా మారిందని, అందినకాడకి నిధులు బొక్కేస్తున్నారని, నీటిపారుదలశాఖ అవినీతి పారుదలశాఖగా తయారైందంటూ మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి ధ్వజమెత్తారు. ఈనెల 12న నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే దాదాపు రూ. 3వందల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ఒకే పనికి రెండుమూడు సార్లు బిల్లులు వేసి డబ్బు తినేస్తున్నారని, నీటిపారుదలకు సంబంధించిన అనేక పనులు చేయకుండానే చేసినట్లు లెక్కల్లో చూపించుకుని బిల్లులు డ్రా చేస్తున్నారని దుయ్యబట్టారు. మంత్రి కాకాణి అండదండలతో ఆ శాఖలో అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని, రైతులు వాటిపై ఆధారాలతో సహా ముఖ్యమంత్రి నుంచి కలెక్టర్ వరకు ఎందరికి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఈ కుంభకోణాలపై విచారణలు జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, అక్రమార్కుల ఆటలు కట్టిస్తామని ఆయన హెచ్చరించారు.

## పేద బ్రాహ్మణ విద్యార్థులకు
# నగదు ప్రోత్సాహకాలు



నెల్లూరు నగరంలోని తిప్పరాజు వెంకట సుబ్బయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 10న స్థానిక టీవీఎస్ కల్యాణ సదన్‌లో జరిగిన కార్యక్రమంలో 73 మంది పేద బ్రాహ్మణ విద్యార్థులకు రూ. 4 లక్షల రూపాయల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అజయ్ మాట్లాడుతూ, బ్రాహ్మణ విద్యార్థులు పేదరికం వల్ల చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశ్యంతో ఈ ప్రోత్సాహకాలను అందిస్తున్నామని చెప్పారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఫణిరత్నం, అధ్యక్షులు ఎస్‌వీఎస్‌కెఎస్ ప్రసాద్, సభ్యులు డాక్టర్ నాగదేవిప్రసాద్, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# 'తంగిరాల మహాభారతం' 93వ భాగం




నల, దమయంతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె జన్మిస్తారు. వాళ్ళు ఇంద్రసేనుడు, ఇంద్రసేన. కలిపురుషుడు దమయంతిని వివాహమాడిన నలునిపై కక్ష పెట్టుకుని అదను చూసి అతనిలో ప్రవేశించి బుద్ధి కోల్పోయేటట్లు చేస్తాడు. నలమహారాజు జూదంలో పుష్కరుని చేతిలో ఓడిపోయి సర్వ సామ్రాజ్యాన్ని, ఐశ్వర్యాన్ని పోగొట్టుకొని కట్టుబట్టలతో దమయంతిని తీసుకొని అరణ్యాలపాలవుతాడు.

ఆకలి భరించలేక, ఎగురుతున్న పక్షులను పట్టుకుని వాటి మాంసం తిందామని తన ఉత్తరీయం, వాటిపైకి విసిరివేయగానే, దాన్ని కూడా ఆ పక్షులు పట్టుకుపోతాయి.

ఆకలి దప్పికలతో, అలసిపోయి నిద్రపోతున్న దమయంతిని చూసి తను లేకపోతే ఆమె పుట్టింటికి వెళ్ళి సుఖ పడుతుందని భావించి ఆమెను వదల లేక, వదలలేక విడిచిపెట్టి వెళ్ళిపోతాడు నలుడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.






## ఫిల్మ్‌ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో..
# మహిళామణులకు సత్కారాలు



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ తరపున నెల్లూరులోని ఫిల్మ్‌ఛాంబర్ కో-ఆర్డినేటర్ కళాంజలి అనంత్ అధ్వర్యంలో ఈ నెల 7న సంబరాలు జరిగాయి. స్థానిక టౌన్‌హాల్ రీడింగ్‌రూమ్‌లో జరిగిన ఈ వేడుకలకు అతిథులుగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని, సమాజానికి ఉత్తమ సేవలందిస్తున్న మహిళలకు సత్కారాలు చేశారు. సినీనటీమణులు లక్ష్మీ మధుబాల, జాను, ప్రమీల, సంగీత ఉపాధ్యాయిని మల్లాది అనూష, శాస్త్రీయ నృత్యకళాకారిణి అరిగెల శివసాయిచరిత, సినీ హీరోయిన్ రూపారెడ్డి, సచివాలయం వలంటీర్ 'సేవామిత్ర' కట్టా రాజేశ్వరి, కానిస్టేబుల్ సిహెచ్ ప్రవీణల సేవలను అభినందించి సన్మానించారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ నేతృత్వంలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం హర్షదాయకమని ఈ సందర్భంగా వక్తలు కళాంజలి అనంత్‌ను అభినందించారు. తొలుత 'పాడుతా తీయగా' గాయని జ్ఞానశ్రీ పాడిన పాటలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథులుగా సెన్సార్‌బోర్డు సభ్యురాలు డా.మారం విజయలక్ష్మి, 'గానం' అకాడమీ డైరెక్టర్ కళైమణి ఏ.లక్ష్మీప్రసన్న, ప్రముఖ కవయిత్రి జి.సుభద్రాదేవి, కళావిశారద పాబోలు శారదామణి, కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి, అపోపా మహిళా అధ్యక్షురాలు పైడా కృష్ణప్రియ, లయన్ సుధారాణి ప్రియదర్శిని పాల్గొన్నారు.

# సమాజంలో మహిళల పాత్ర కీలకం

## - మాజీ ఉప రాష్ట్రపతి మన వెంకయ్య

కుటుంబంలోనూ, సమాజంలోనూ మహిళల పాత్ర ఎంతో కీలకమని, మహిళా సాధికారతతోనే పురోభివృద్ధి సాధ్యమని మాజీ ఉప రాష్ట్రపతి మన వెంకయ్యనాయుడు చెప్పారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఆ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ.. వెంకయ్య కుమార్తె దీపా వెంకట్ అధ్యక్షత్వంలో ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకయ్య మాట్లాడుతూ, మహిళల సాధికారత విషయంలో అనేకదేశాల్లో పురోగతి ఉన్నా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఇంకా అనేక రకాల సమస్యల సవాళ్ళను అధిగమించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. మనదేశంలో మహిళల పట్ల ప్రజల ఆలోచనా ధోరణిలో మార్పు రావాలన్నారు. లింగ వివక్ష నిర్మూలనతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. విద్యతో చైతన్యం పెరుగుతుందని, అందువల్ల ఆడబిడ్డలను తల్లితండ్రులు ఉన్నత విద్యలు చదివించాలన్నారు. మహిళల భాగస్వామ్యం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని, ఆత్మనిర్భర భారత్ నిర్మాణలో స్త్రీశక్తి పాత్ర గణనీయమైనదని, అన్ని రంగాల్లోనూ మహిళల అభ్యున్నతికి ప్రోత్సాహం అందించాల్సి ఉందని సూచించారు. రాజకీయ రంగంలోనూ మహిళలకు ఎక్కువ అవకాశాలు కల్పించి శాసన సభకు, పార్లమెంట్‌కు వెళ్ళేలా చూడాలన్నారు. మహిళలు వంటగదికే పరిమితం కాకుండా తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో



ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా భారత రక్షణ, పరిశోధన తదితర రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న పలువురు మహిళలకు పురస్కారాలందించారు.

ప్రముఖ శాస్త్రవేత్త ఆచార్య విజయ ఖాదర్, ఐపీఎస్ అధికారిణి రాజారత్నం అనూరాధ, ఘంటసాల పార్వతి రవి (కళాప్రదర్శిని మేనేజింగ్ ట్రస్టీ–చెన్నై), లత (షార్ సెంటర్), బికె నివేదిత (అసోసియేట్ డైరెక్టర్ –ఇస్రో), ఉషా పి వర్మ (అసోసియేట్ డైరెక్టర్–డీఆర్‌డీఓ), శిరీషా (ప్రాజెక్టు డైరెక్టర్–డీఆర్‌డీఓ)లను స్వర్ణ భారత్ ట్రస్ట్ తరఫున వెంకయ్యనాయుడు, దీపా వెంకట్‌లు అభినందించి పురస్కారాలతో గౌరవించారు. ట్రస్టీ హరికుమార్ రెడ్డి, రత్నం విద్యాసంస్థల అధినేత డా. కిషోర్ రత్నం, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

### యాంత్రిక జీవనశైలి వల్లనే అనారోగ్యం :

తొలుత, స్వర్ణభారత్ ట్రస్ట్, నారాయణ వైద్యకళాశాల, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్యశిబిరాన్ని వెంకయ్యనాయుడు ప్రారంభించి మాట్లాడుతూ, మంచి వైద్యాన్ని గ్రామీణులకు అందించాలనే ధ్యేయంతో స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా ప్రతినెలా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. నేటి కాలంలో మారుతున్న జీవనశైలి వల్ల, ఉరుకుల పరుగులతో యాంత్రిక జీవితాలను సాగించడం వల్ల అనేక వ్యాధులు సంక్రమిస్తున్నాయని, పాశ్చాత్యపు ఆహారపుటలవాట్లతో సంప్రదాయ ఆహారం తీసుకోకపోవడం వల్ల బీపీ, షుగర్, గుండెపోటు వంటి జబ్బులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కరోనా తర్వాత ప్రజల్లో కొంతమేరకు అవగాహన కలిగిందని, సిరిధాన్యాలతో తయారుచేసిన ఆహారం తీసుకోవడంపై ఆసక్తి కలగడంతో పాటు, ఆర్గానిక్ ఆహారం పట్ల కూడా ప్రజల్లో మంచి అవగాహన వచ్చిందన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.



## నేదురుమల్లి నివాసంలో..

# వేడుకగా వైకాపా వ్యవస్థాపక దినోత్సవం

వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో ఈనెల 12న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం వేడుకగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, వైకాపా వ్యవస్థాపక అధ్యక్షులు వైయస్ జగన్మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీని స్థాపించి 13 సంవత్సరాలు పూర్తయి, 14వ వసంతంలోకి అడుగిడిన సందర్భంగా వెంకటగిరిలో పార్టీ ఆవిర్భావ వేడుకలలో భారీ కేకును కట్‌చేసి అందరికీ పంచారు. రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్, వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైకాపా నాయకులు, నేదురుమల్లి కుటుంబ అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.






# సంస్మరణ



అమృతమూర్తి, ఆత్మీయదీప్తి,
మా ఇంటి దైవం, మా అమ్మ

## శ్రీమతి పూండ్ల కామేశ్వరమ్మ గారు

(W/o లేట్ పూండ్ల చెంచురెడ్డి గారు)

తేది.18.03.2024న ఆమె 4వ వర్ధంతి సందర్భంగా
ఆ ప్రేమమూర్తిని సంస్మరించుకుంటూ...

కుమారులు :
**డా॥ పూండ్ల శ్రీనివాసులురెడ్డి**
**పూండ్ల వెంకురెడ్డి**
మరియు
**కుటుంబసభ్యులు**



## 'మహిళా దీవెన'కు అపూర్వ స్పందన

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 27వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ రిత్విక్ లేఅవుట్లోని వైయస్సార్ సిటిజన్ రిసోర్స్ భవనం ప్రాంగణంలో 27వ డివిజన్ ఇంచార్జ్ సన్నపరెడ్డి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో, నెల్లూరు నగర వైసీపీ అధ్యక్షులు సన్నపరెడ్డి పెంచలరెడ్డి అధ్యక్షతన ఈనెల 13న జరిగిన 'మహిళా దీవెన'కు అపూర్వ స్పందన లభించింది. వందలాదిగా మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. నెల్లూరు రూరల్ వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ వైకాపా అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావుయాదవ్, జిల్లా పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ పోట్లూరు స్రవంతి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విజయసాయిరెడ్డి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆశీస్సులతో నెల్లూరు పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్న తనను, నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ప్రజలందరూ ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

## శ్రీసిటీని సందర్శించిన.. త్రిపుర విద్యార్థుల బృందం



కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ చొరవతో 'ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్' యువ సంఘం కార్యక్రమంలో భాగంగా త్రిపురకు చెందిన 45 మంది విద్యార్థులు, అధ్యాపకుల బృందం ఈనెల 12న శ్రీసిటీని సందర్శించింది. శ్రీసిటీ వేగవంతమైన పారిశ్రామిక అభివృద్ధిని విద్యార్థులకు పరిచయం చేయడమే ఈ పర్యటన ప్రధాన లక్ష్యంగా సాగింది. ఈ బృందానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికి, కేంద్ర విద్యాశాఖ చొరవను ప్రశంసించారు. దేశ సమైక్యతను చాటిచెబుతూ దేశంలోని విభిన్న ప్రాంతాలు, సంస్కృతులు, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేసే ఈ కార్యక్రమానికి శ్రీసిటీని ఎంపిక చేయడం తాము గౌరవప్రదంగా భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రీసిటీ గురించి ఆ బృందానికి వివరిస్తూ, ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, ఎఫ్ఎంసీజీ తదితర వివిధ రంగాలకు సంబంధించి భారత్‌తో సహా 28 దేశాలకు చెందిన 210 పరిశ్రమలు శ్రీసిటీలో ఉన్నాయని తెలిపారు. ఈ కంపెనీలు మేక్ ఇన్ ఇండియా నినాదాన్ని బలపరుస్తూ భారీ ఉద్యోగాల కల్పనకు ఎలా కృషి చేస్తున్నాయో వారికి వివరించారు. శ్రీసిటీ ప్రపంచ శ్రేణి సదుపాయాలు, చక్కని వాతావరణం తమనెంతగానో ఆకట్టుకుందని విద్యార్థులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తమ అధ్యయనానికి, భవిష్యత్ ప్రణాళికలకు ఈ పర్యటన ఎంతో ఉపయోగకరమన్నారు. తమకు ఆతిథ్యమిచ్చిన శ్రీసిటీ యాజమాన్యానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

### ఎన్‌బికెఆర్‌లో వక్తల ఆకాంక్ష



మనదేశంలోని మహిళలు అభివృద్ధి పథంలో పయనించాలని, అన్ని రంగాల్లో రాణించాలని వక్తలు ఆకాంక్షించారు. కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో కళాశాల డైరెక్టర్ డా. వి. విజయకుమార్‌రెడ్డితో పాటు నెల్లూరులోని అపోలో ఆసుపత్రి న్యూరాలజిస్ట్ డాక్టర్ జేసీ రస్మిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థినులు ప్రతిభతో సమాజంలో సమున్నతస్థాయిని అందుకోవాలని, దేశానికి ఉత్తమ సేవలందించాలని చెప్పారు. అనంతరం, విద్యార్థినులకు గత వారంరోజులుగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త డా.ఎస్ ఇందుమతి, డా.బి వాసవి తదితరులు పాల్గొన్నారు.

# మరో రెండు గ్రామాల్లో వీపీఆర్...'అమృతధార'



ప్రముఖ ప్రజాసేవకులు, సేవాభూషణులు, రాజ్యసభ సభ్యులు.. టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తాను గత కొంతకాలంగా చేపట్టిన అమృతధార కార్యక్రమంలో భాగంగా, ఈనెల 13న జిల్లాలోని మరో రెండు గ్రామాల్లో వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటుచేసి, ఆ గ్రామీణ ప్రాంతాల దాహార్తిని తీర్చారు. నెల్లూరులోని వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోవూరు నియోజకవర్గం, విడవలూరు మండలం చెలికల, ముదివర్తి గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమృతధార వాటర్‌ప్లాంట్లను ఆయన టీడీపీ కోవూరు ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డితో కలసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఘనంగా స్వాగతించి సన్మానించారు. అనంతరం ముదివర్తిలోని టీడీపీ కార్యాలయాన్ని సందర్శించి, అక్కడి నుంచి చెలికల గ్రామానికి చేరుకుని గ్రామంలో ఏర్పాటు చేసిన వీపీఆర్ అమృతధార వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని కూడా దర్శించుకున్నారు. ముదివర్తిలో శ్రీరాముని దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై వేమిరెడ్డి మాట్లాడుతూ.. 2017వ సంవత్సరం నుంచి తాను అమృతధార కార్యక్రమం నిర్వహిస్తున్నానని, నీళ్ళు సరిగా అందుబాటులోని గ్రామీణప్రాంతాల్లో పరిశుభ్ర జలాలను అందించేందుకు ఈ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్లాంట్ల నిర్వహణ కూడా ఫౌండేషన్ తరపునే చేస్తామన్నారు, అందుకు గ్రామస్థులెవరూ ఇందుకు ఒక్క రూపాయి కూడా ఎవరూ ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తాను నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, తప్పకుండా ప్రజలందరి మద్దతు కావాలని ఆయన గ్రామస్తులను కోరారు. డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, కో-ఆప్టెడ్ సభ్యులు రఫీ, ముదివర్తి ఉప సర్పంచ్ శరత్‌చంద్ర, శ్రీనివాసులురెడ్డి, ఖలీమ, పద్మ, పట్టపు జ్యోతి, వెంకయ్య, మాధవి, దామేగుంట వెంకట శేషారెడ్డి, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



## ప్రీతిపాత్రుడు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అందరికీ ప్రీతిపాత్రులని రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొనియాడారు. ఈ నెల 13వ తేదీ వాకాడులోని స్వర్ణముఖి బ్యారేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి విగ్రహాన్ని పెద్దిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం, గూడూరు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో చెప్పినవన్నీ నూటికి నూరుశాతం అమలు చేశారని, ఈ ఎన్నికలను ప్రతి ష్టాత్మకంగా తీసుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జగన్ తెచ్చిన మంచి పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని, విద్య, వైద్యానికి దేశంలో ఏ ముఖ్యమంత్రి ఇవ్వని ప్రాధాన్యత కల్పించారన్నారు. చంద్రబాబునాయుడు చెప్పింది చేయరని, ఏదో విధంగా అధికారంలోకి రావాలని జనసేన, బీజేపీని కలుపుకున్నా డని ఎద్దేవా చేశారు. గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్‌ని, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థి గురుమూర్తిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థులు మేరిగ మురళీధర్, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎంపి గురుమూర్తి, ఎమ్మెల్సీ కళ్యాణ్‌చక్రవర్తి, పొణకా దేవసేనమ్మ, యల్లసిరి గోపాల్‌రెడ్డి, మీరారెడ్డి, కల్పలత, నాసిన నాగులు, బొమ్మిడి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానాలు

దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతిని పురస్కరించుకుని గూడూరు మండలం లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానాలు జరిగాయి. ట్రస్ట్ ఛైర్మెన్ సయ్యద్ తాజుద్దీన్, ఉపాధ్యాయుడు నరేంద్రచౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మహిళల సంక్షేమానికి కృషి

### ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

మహిళల సంక్షేమానికి వైకాపా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ, గూడూరు వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ తెలిపారు. గూడూరు పట్టణంలోని సి.ఆర్.రెడ్డి కళ్యాణ మండపంలో ఈ నెల 11న చేయూత చెక్కులను గూడూరు మండలం పొదుపు మహిళలకు అందజేశారు. వైకాపా నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మెన్ పొణకా దేవసేనమ్మ, మల్లు విజయకుమార్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## తెలుగుదేశంతోనే పేదల సంక్షేమం



యువత అభివృద్ధే ధ్యేయంగా పనిచేసే తెలుగుదేశం పార్టీకి ఓటేసి విజయం అందించాలని మాజీఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు మండలం వెందోడు గ్రామంలో బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని ఈ నెల 12వతేదీన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వెందోడు గ్రామంలో రూ.6కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 30 కుటుంబాల వైకాపా నాయకులు తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. నాయకులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి, కనుమూరు హరిచంద్రారెడ్డి, రాఘవరెడ్డి, ముమ్మడి అమరేంద్ర, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ వెస్ట్ క్లబ్ రక్తదాన శిబిరం

రోటరీ వారోత్సవాలలో భాగంగా ఈనెల 10వతేదీ గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. ఎస్ఎల్ఎన్ బాబు నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో 15 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. క్లబ్ అధ్యక్షులు సనత్‌రెడ్డి మాట్లాడుతూ క్లబ్ సభ్యులు, నెల్‌క్యాస్ట్ సిబ్బంది రక్తదానం చేశారని వారిని అభినందించారు. డా. లక్ష్మీనారాయణ, ఆడిటర్ రామ్మోహన్‌రావు, ధనుంజయరెడ్డి, వాసుగౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డి, కోట కృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ సంక్షేమం అందించిన సీఎం జగనే!

## ప్రశంసించిన ఎంపీ ఆదాల

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమం అందించారని, ప్రతి కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకం లబ్ధి చేకూరిందని, ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలని నెల్లూరు రూరల్ వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని చింతారెడ్డిపాలెంలో ఆయన ఇటీవల జిల్లా పరిషత్ అధ్యక్షురాలు ఆనం అరుణమ్మ, నెల్లూరు నగర మేయర్ పొట్లూరు స్రవంతి జయవర్ధన్, మాజీ డిసిసిబి అధ్యక్షులు ఆనం విజయ్‌కుమార్‌రెడ్డిలతో కలిసి పలు అభివృద్ధి నిర్మాణ పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, తద్వారా పేద పిల్లలు కార్పొరేట్ స్థాయి విద్యను అభ్యసించేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని, ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, 25 లక్షల రూపాయల వరకు ఆరోగ్యశ్రీ కార్డు వర్తింపజేశారని అన్నారు. జడ్పీ ఛైర్పర్సన్ ఆనం అరుణమ్మ విజ్ఞప్తి మేరకు వెంటనే కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 16 లక్షల రూపాయల నిధులను ఎంపీ లాడ్స్ ద్వారా మంజూరు చేస్తున్నానని ఆయన వెల్లడించారు.



### చంద్రబాబును నమ్మితే... నట్టేట మునిగినట్లే:

అవ్వాతాతలకు ఇస్తున్న రూ. 3వేల పెన్షన్ రూ. 4వేలకు పెరిగే అవకాశం లేకపోలేదని, పొరపాటున చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే ఇప్పుడు వస్తున్న సంక్షేమ పథకాల్లో సగం వరకు ఆగిపోవడం ఖాయమని ఈ సందర్భంగా ఆదాల చెప్పారు. చంద్రబాబు మాటలు నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, నెల్లూరు లోక్‌సభ నుండి పోటీ చేస్తున్న విజయసాయిరెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ అధ్యక్షులు ఆనం విజయకుమార్‌రెడ్డి, మేయర్ పొట్లూరు స్రవంతి, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, సయ్యద్ మొబినా, సిహెచ్ హరిబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## చౌకచర్లలో డాక్టర్ మారం వైద్యసేవలు

విడవలూరు మండలం చౌకచర్లలో ఈనెల 10న 'మన ఆసుపత్రి' అధినేత, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మారం సుధాకర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి 250 మందిరోగులకు వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదప్రజలకు వైద్యసాయం అందిస్తున్న డాక్టర్ మారం సుధాకర్‌ను స్థానిక ప్రజలు, పలువురు ప్రముఖులు అభినందించి సత్కరించారు ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్సీఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు దద్దోలు రమేష్, సిపిఎం నాయకుడు శ్రీనివాసులు, భారత్ ఆక్సా లైఫ్ ఇన్సురెన్స్ నెల్లూరు శాఖ మేనేజర్ నరసింహారెడ్డి, ఆంధ్రబ్యాంక్ విశ్రాంత మేనేజర్ శ్రీనివాసరావు, ఆర్ఎంపి వైద్యుడు శ్రీనివాసులుతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బుజబుజనెల్లూరు విద్యార్థులకు పరీక్షసామగ్రి

నెల్లూరు సమీపంలోని బుజబుజనెల్లూరు డివిఎన్ఎం జడ్పీ హైస్కూలు పదవ తరగతి విద్యార్థులకు పీఎంపి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ ఈనెల 11న పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ పరవస్తు నాగసాయి సూరి మాట్లాడుతూ, విద్యార్థులు పరీక్షలు బాగా రాసి ఉత్తమశ్రేణి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ల్యాప్రోస్కోపిక్ సర్జన్ చైతన్య, పాఠశాల వ్యవస్థాపకులు దూడల ప్రసాద్‌రావు, హెచ్ఎం మల్లికార్జునరావు, అసోసియేషన్ నాయకులు జయప్రకాష్, రూడ్స్ స్వచ్ఛంధ సంస్థ ఛైర్మెన్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా 'నారీశక్తి'



నెల్లూరులోని నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో సి.పి అండ్ పి. హెచ్.పి.డబ్ల్యు.ఏ, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక దర్గామిట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో వేదాయపాలెం సుస్మిత నర్సింగ్ స్కూల్ విద్యార్థినులతో నారీశక్తి కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన ఫిట్‌నెస్ రన్‌లో పెద్దసంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి డా. మహేంద్రరెడ్డి పాల్గొని రన్నింగ్ రేస్‌లో పోటీలు ప్రారంభించారు. ఈ పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజయం సాధించిన బి.లక్ష్మి, పి.రూప, ఎస్.పావనిలకు 'మై భారత్ కిట్'లు బహుకరించారు. పీఎంపీ గౌరవాధ్యక్షులు అనుమల జయప్రకాష్, జడ్పీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మెట్టు సుధాకర్‌రెడ్డి, ఖాజా మస్తాన్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ షేక్ రసూల్, శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, ఉప్పలపాటి రామదాసు తదితరులు పాల్గొన్నారు.



## జానకిరామ.. రామాయణం 4

- ఊటుకూరు జానకి రామారావు

దేవతల బాధలు చెప్పనలవిగాకుండా ఉన్నవి.

వాడు! రావణాసురుడు! వరగర్వితుడై ముల్లోకాలను పట్టి పీడిస్తున్నాడు! వాడి పీడ వదిలించుకొనే మార్గం తెలియక యమయాతన పడుతున్నారు దేవతలు.

చివరకు వారందరూ కలసి నిర్ణయించుకొని వాడికి వరములిచ్చిన విధాతనే ప్రార్థింప నిశ్చయించుకొని, ఆయన వద్దకు వెళ్ళి అంజలి ఘటించి నిలిచి తాము వచ్చిన పని ఆయనకు ఎరుక పరచినారు!

దేవా! రావణాసురుడు బలదర్పితుడై, వర గర్వముతో నీచే ఏర్పరచబడిన మా మా విధులు కూడా నిర్వర్తించనీయకుండా మమ్ములను భయభ్రాంతులకు గురిచేయుచున్నాడు !

సూర్యుడు ఆయనకు వేడి కలిగించలేడు! వాయువు ఆయన ప్రక్కన మసలటానికే భయపడుతున్నాడు! ఉత్తుంగ తరంగాలతో తీవ్రఘోషతో నిత్యం సందడిగా ఉండే సముద్రుడు తరంగాలను స్తంభింపచేసుకొని కూర్చున్నాడు!

బ్రహ్మదేవుడు దేవతలను విష్ణుమూర్తిని ప్రార్థించమని సలహా ఇవ్వగా, అందరూ ఆ దేవాధిదేవుని శరణుజొచ్చి దీనంగా ప్రార్థించారు.

అప్పుడు విష్ణుమూర్తి.... తాను మానవ రూపంలో జన్మించి రావణ పీడనుండి మిమ్ములను కాపాడతానని అభయమిచ్చినాడు. తాను రాబోయే రోజులలో దశరథమహారాజుకు పుత్రుడుగా జన్మిస్తానని చెప్పి వారిని పంపివేశాడు.

అదే సమయంలో దశరథమహారాజు సంతానార్థియై అశ్వమేధము పూర్తిచేసి పుత్రేష్టి చేస్తున్నాడు.

అప్పుడు యజ్ఞకుండమునుండి ఒక తేజోమయమైన భూతం ఆవిర్భవించింది. ఆ భూతం చేతిలో ఒక స్వర్ణపాత్ర! అందులో పాయసము నిండి వున్నది!

ఆ భూతము ఆ పాయసపాత్రను దశరథుడికి అందచేసింది. భార్యలచేత ఆ పాయసాన్ని సేవింప చేశాడు దశరథుడు!

మొదట సగము కౌసల్యకు, ఆ సగములో సగము అనగా మొత్తములో నాల్గవ వంతు సుమిత్రకు, ఆ నాల్గవ వంతులో సగము అనగా మొత్తములో ఎనిమిదవ వంతు కైకకు ఇచ్చి, ఇక మిగిలిన ఎనిమిదవ వంతును రెండవసారి సుమిత్రకు ఇచ్చినాడు.

(రావణుడు ప్రకృతిని నాశనం చేస్తున్నాడు అని అర్థం, దేవతలు అనగా ప్రకృతి శక్తులు! నిత్యమూ వ్యాపించే గుణమున్న ఒకానొక శక్తి వాటి సమతుల్యాన్ని కాపాడుతుంది! అది విష్ణుస్వరూపం! ఎప్పుడెప్పుడు ప్రకృతి తన సమతుల్యాన్ని కోల్పోతుందో! అప్పుడప్పుడు సర్వవ్యాపకమైన మహాశక్తి తనను తాను సృజించుకొని ప్రకృతిని కాపాడుతుంది. ఇది ధర్మం!

Today's civilization is a replica of RAAVAN culture! It is eating into the vitals of nature. To strike a balance between all natural forces the GOD ALMIGHTY incarnates himself.

The form he assumes need not be that of human. Any form of life it may take!... అందుకే భారతీయ పురాణాలలో అన్ని అవతారాలు)

యజ్ఞము పరిసమాప్తమయ్యింది, సరిగ్గా పన్నెండు మాసాలకు మరల వసంతం వచ్చింది! దశరథమహారాజు జీవితంలో ఈ వసంతం ఒక్క కొత్తశోభ తెచ్చింది. మోడువారిన జీవిత ఆశ చిగుర్చింది.

దశరథుడి మనోరథం నెరవేరింది!

చైత్రమాసంలో నవమి తిథి, పునర్వసు నక్షత్రం, అయిదు గ్రహాలు తమ తమ ఉచ్ఛస్థితిలో ఉండగా!

అప్పుడు రవి మేషంలో ఉన్నాడు

కుజుడు మకరంలో ఉన్నాడు

గురుడు కర్కాటకంలో ఉన్నాడు

శుక్రుడు మీనంలో ఉన్నాడు

శని తులా రాశిలో ఉన్నాడు

ఆయా రాశులన్నీ కూడా ఆయా గ్రహాలకు ఉచ్ఛస్థానాలు!.

చంద్రుడు స్వస్థానమైన కర్కాటకంలో ఉన్నాడప్పుడు!

అంటే పునర్వసు నాల్గవపాదం! అన్నమాట!

గురుచంద్రయోగం సంభవించింది!

లగ్నము కూడా కర్కాటకమే!

ఆ శుభలగ్నమందు కౌసల్య జగత్కల్యాణ కారకుడు, జగన్నాథుడు, ఇక్ష్వాకు వంశ వర్ధనుడు అయిన శ్రీరామచంద్రుని పుత్రునిగా కన్నది!..

శ్రీ రామ జననమయిన పదహారు గంటల తరువాత భరతుడు మీనలగ్నంలో కైకేయికి జన్మించాడు! ఆయన నక్షత్రం పుష్యమి!

ఆ తరువాత మధ్యాహ్న కాలంలో కర్కాటక లగ్నంలో ఆశ్లేషా నక్షత్రంలో లక్ష్మణ, శత్రుఘ్నులకు జన్మనిచ్చింది సుమిత్ర!

రాజ్యమంతా కోలాహలం, ఉత్సవాలు, సంబరాలు, రాజు ఇచ్చే భూరిదానాలతో పదకొండురోజులు గడిచినాయి!



పదకొండవరోజున నవజాతశిశువులకు నామకరణం జరిగింది.

ఆయన పుట్టి దశరథుడికి మహదానందం కలుగచేశాడు, జనులందరికీ సంతోషం కలుగచేశాడు!

ఎవనియందుయితే సర్వజనులకు ఆనందం కలుగుతుందో! అతడే రాముడు, రమింపచేయువాడు అని అర్థం. పెద్ద కుమారుడికి "రాముడు" అని పేరు పెట్టారు వశిష్ఠ మహర్షి!.

సంపద, శోభ కలవాడు కావున లక్ష్మణుడు !

రాజ్యమును భరించువాడు కావున భరతుడు!

శత్రువులకు సింహస్వప్నము, వారిని చంపువాడు కావున శత్రుఘ్నుడు!

నలుగురు కుమారులను చూసుకొని దశరథుడు మురిసిపోతున్నాడు ఆయన ఆనందానికి అవధులు లేవు.

రాముడంటే మరీ! ఆయన అన్ని ప్రాణాలూ రాముడే!

రాముడికి ఎవరు సహాయం చేస్తారు?

మీరంతా రావణ సంహారం జరగాలని కోరుకున్నారు. విష్ణువు దశరథమహారాజు కొడుకుగా జన్మించాడు, మరి రావణునితో జరిగే పోరాటంలో ఎవరు పాల్గొంటారు?

ఆయన సైన్యం ఎవరు? విష్ణువుకు సైన్యసహకారం ఎవరిస్తారు?

ఆందరు దేవతల మదిలో ఈ ఆలోచన పుట్టించి, వారిని ప్రేరేపించాడు బ్రహ్మదేవుడు.

ఒకప్పుడు రావణాసురుని నందీశ్వరుడు శపించాడు!

నీకు వానరుల(కోతుల)వలన భయం కలుగుగాక ! అని

ఆ శాపాన్ని తమకు వరంగా మార్చుకోవాలనుకున్నారు! దేవతలంతా!

.. (సశేషం)

## కళ్యాణ వైభోగం...!





**శ్రీనందన్‌రెడ్డి - డా. శశికళ**

పెన్నా సిమెంట్స్ సంస్థ దక్షిణ భారతదేశ ప్రెసిడెంట్ తన్నమాల శ్రీధర్‌రెడ్డి - శ్రీమతి విజయల కుమారుడు **శ్రీనందన్‌రెడ్డి - డా. శశికళ** (కొమ్మలపూడి వాస్తవ్యులు గూడలి వెంకటరమణారెడ్డి - శ్రీమతి రమల కుమార్తె)ల కళ్యాణం మార్చి 6వ తేదీ నెల్లూరులో వైభవోపేతంగా జరిగింది. పెన్నా సిమెంట్స్ వ్యవస్థాపకులు మరియు చైర్మెన్ పుట్టంరెడ్డి ప్రతాప్‌రెడ్డి దంపతులతో పాటు వారి సోదరుడు వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణపట్నం పోర్టు సిఇఓ జి.జే.రావులతో పాటు రాష్ట్రానికి చెందిన అనేకమంది ప్రముఖులు, వ్యాపారవేత్తలు ఈ పెళ్లి వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కొత్త జంటకి 'లాయర్' శుభదీవెనెలు.

## 'సత్య' వాక్కు

(మొదటి పేజీ తరువాయి)

"సత్య వాక్కు" ఫలించినట్లుగా అయ్యింది. బీజేపీకి జగన్‌పై ప్రత్యేక ప్రేమ లేదని తేలిపోయింది.

పార్టీని, పార్టీ సిద్ధాంతాలని ప్రజల్లోకి, ముఖ్యంగా యువతలోకి విస్తృత స్థాయిలో తీసుకుపోగల సత్తా సమర్థతా సత్యకుమార్‌కి ఉన్నాయని, ఏపీ పార్టీ అధ్యక్ష పగ్గాలు ఆయనకి ఇస్తే బీజేపీ రాష్ట్రంలో ఊహించని స్థాయిలో బలపడే అవకాశం ఉందని పలు సందర్భాల్లో రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. రేపు జరగబోయే ఎన్నికలలో ఆయనకి హిందూపురం లోక్‌సభ అభ్యర్థిగా పోటీచేసే అవకాశం వస్తుందని 'సత్య' అభిమానులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. పార్టీ కసరత్తు ఈరోజో రేపో పూర్తయితే కానీ సత్య అభ్యర్థిత్వంపై స్పష్టత రాదని పార్టీ వర్గాలు చెప్తున్నాయి!

# ఆంధ్రాలో వ్యూహాత్మక పొత్తులు.. ఎత్తులు!

(మొదటి పేజీ తరువాయి)

తమ ఉనికిని చాటుకోవడానికి ఆపసోపాలు పడుతున్నాయి. ఇదీ ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రం.


### ఎన్‌డిఏని బలోపేతం చేయడమే బీజేపీ లక్ష్యం!



జూన్ 2024లో కేంద్రంలో మళ్ళీ అధికారంలోకి రాబోయేది భారతీయ జనతా పార్టీయే. భారతదేశమంతా ముక్తకంఠంతో చెప్తున్న మాట ఇది. గత పదేళ్ళుగా ఆ పార్టీ సాధించిన ఘనతే కమలనాథులలో ఆ నమ్మకాన్ని కల్పిస్తోంది. కేంద్రంలో మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ఆర్థిక సంస్కరణలు చేపడుతూ సంక్షేమం – అభివృద్ధి రెండు కళ్ళుగా భావిస్తూ జనరంజక పాలన సాగిస్తోంది. దేశవ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తోంది. ప్రధానమంత్రి ప్రధానంగా విద్య, వైద్య రంగాలతో పాటు ఇతర విభాగాలన్నింటిపైనా దృష్టిపెట్టి మౌలిక సదుపాయాల కల్పనలో దేశాన్ని అగ్రస్థానంలో నిలిపే దిశగా అడుగులు వేస్తున్నారు. దేశంలోని పలు రైల్వేస్టేషన్లకి లక్షల కోట్ల నిధులతో కొత్త రూపాన్ని కల్పిస్తున్నారు. మంచినీటి సమస్యకి పరిష్కారం చూపిస్తున్నారు. ఆరోగ్య రక్షణకి భరోసా కల్పిస్తున్నారు. ప్రతీ దీపావళి రోజున దేశ సరిహద్దుని సందర్శించి మనదేశాన్ని రక్షిస్తున్న సైనికులలో భరోసాని కల్పిస్తున్నారు. వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు. ప్రధాన ఆలయాలకు శోభని కల్పించి హిందుస్థాన్ అంటే హిందుత్వదేశం అన్న సందేశాన్ని ప్రపంచానికి అందిస్తున్నారు. రైల్వే విభాగానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ సందర్భంలో.. "నా జీవితం రైలుపట్టాలపైనే మొదలయింది" అని తన గతాన్ని గుర్తుచేసుకుంటూ వినయంగా, వినమ్రంగా ఆయన చేస్తున్న ప్రసంగం ప్రజలని అమితంగా ఆకట్టుకుంటోంది. అందుకే ఆయన పట్ల ప్రజల్లో ఆదరణ స్పష్టంగా కనిపిస్తోంది. మళ్ళీ ఆయనే గెలుస్తాడన్న మాట సర్వత్రా వినిపిస్తోంది.

ఇప్పుడు బీజేపీ ముందున్న లక్ష్యం రేపటి ఎన్నికలలో గెలుపు కాదు. అది ఎలాగూ నిర్ణయమైపోయిందన్నది వారి ధీమా. వారి ఆశయం ఒక్కటే. "ఇండియా" కూటమిని నీరుగార్చి ఎన్‌డిఏని బలమైన శక్తిగా తయారుచేయడమే. ఆ వ్యూహంలో భాగంగానే చంద్రబాబుని దగ్గర చేరనిచ్చారు. గతంలోలా భవిష్యత్తులో మళ్ళీ బాబు తోక ఆడించకుండా ఆయనపైన కేసులు పెట్టించారు. అరెస్టు చేయించారు. వాళ్ళే బెయిలు వచ్చేలా చేశారు. ఇప్పుడు జగన్, బాబు ఇద్దరూ కేసులున్న వారే, ఇద్దరూ జైలుకి వెళ్లి బెయిలుపై బయటకి వచ్చినవాళ్ళే. కాబట్టి, ఇద్దరి ఆయువు పట్టు బీజేపీ చేతులలోనే ఉంటుంది. కాబట్టి ఇద్దరిలో ఎవరు గెలిచినా వాళ్లకి నష్టంలేదు. హిందుత్వానికి జగన్ దూరం అన్న ప్రచారం ముమ్మరంగా ఉంది. కాబట్టి, జగన్‌తో కలవడానికి ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలు అడ్డమొస్తాయి. బహుశా జగన్ కూడా బీజేపీతో ప్రత్యక్ష దోస్తీకి ఆసక్తి చూపకపోవచ్చు. అందుకోసమే కమలనాథులు తమ పాత మిత్రుడు చంద్రబాబునే ఎన్‌డిఏలో భాగస్వామిగా చేసుకున్నారన్నది విశ్లేషకుల అభిప్రాయం.


### అధికారమే ఆశయంగా బాబు అంతిమ పోరాటం!



దాదాపు నాలుగున్నర దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న మేధావి చంద్రబాబు. టక్కుటమారా రాజకీయ విద్యలన్నీ తెలిసిన అపర చాణుక్యుడు. ఈ ఎన్నికలలో తేడావస్తే ఏం జరుగుతుందో ఆయనకి బాగా తెలుసు. ఇవే ఆయనకి చివరి ఎన్నికలని ఆయనే ప్రకటించుకున్నారు. తన వారసుడి ప్రతిభాప్రావీణ్యాలు ఆయనకి తెలిసినవే. తన తరువాత నందమూరి వారసుడిగా జూనియర్ ఎన్టీఆర్ వస్తే తప్ప పార్టీ మనుగడ సాగించలేదన్న అవగాహన కూడా ఆయనకి బాగా ఉంది. ఇదే ప్రజాభిప్రాయమన్న విషయం కూడా ఆయన పార్టీ నాయకులు కూడా పలుమార్లు ఆయన చెవిలో ఊదారని సమాచారం. ఇలాంటి తరుణంలో పవన్ కళ్యాణ్‌ని మాత్రమే నమ్ముకుంటే నిట్టనిలువునా మునిగిపోతామని ఆయనకి బాగా తెలుసు. గత ఎన్నికలలో తానే స్వయంగా పోటీచేసిన రెండు స్థానాల్లో సైతం ఓడిపోయిన జనసేనాని ప్రభావం ఈ ఎన్నికల్లో ఎంత ఉంటుందో వూహించుకోలేనంత అమాయకుడు కాదు చంద్రబాబు. చావో రేవో ఈ ఎన్నికలలోనే తేల్చుకోవడానికి ఆయన సిద్ధపడ్డారు. అందుకోసమే బీజేపీతో దోస్తీ కోసం ఆయన పవన్ కళ్యాణ్‌ని పావుగా వాడుకున్నారు. క్రమేణా వారికే దగ్గరయ్యారు. తనకి పరిచయమున్న ఒకరిద్దరు ప్రముఖ సినీతారలతో కూడా బీజేపీకి సిఫారసు చేయించుకున్నారు. జగన్ వల్ల ఆ తారలకు జరిగిన అవమానాన్ని కూడా భాజపా పెద్దల ముందు ఏకరువు పెట్టించారు, చివరికి వారు బాబుని ఎన్‌డిఏలో చేర్చుకునేలా పథకం రచించుకున్నారు. రేపు కేంద్రంలో భాజపా అధికారంలోకి వస్తుందని కూడా బాబుకి బాగా తెలుసు. ఇలాంటి సమయంలో వాళ్ళతో సంధి తనకి అన్ని విధాలా ఉపకరిస్తుందన్నది బాబు ఆలోచన. ఈ ఎన్నికలలో ఖచ్చితంగా తాను గెలవాలి. లేదంటే జగన్‌మోహన్‌రెడ్డి తనని శంకరగిరి మాన్యాలు పట్టిస్తాడని కూడా బాబుకి అనుమానమే. అందుకే ముందుగా తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి అవసరమైన అన్ని పావులు కదుపుతున్నారు. ఒకవేళ ఖర్మజాలక తానూ, తన పార్టీ ఓడిపోతే జగన్ తన జోలికి రాకుండా ఉండడానికి ముందస్తు జాగ్రత్తగా బాబు బీజేపీ నీడలో చేరారన్నది రాజకీయవర్గాల భావన.

### ప్రేక్షకపాత్ర పోషిస్తున్న పవన్ కళ్యాణ్!

నిన్నటివరకూ కాపు సామాజిక వర్గంలోనూ, తన అభిమానుల్లోనూ హీరో అనిపించుకుంటుండిన పవన్ కళ్యాణ్, ఇప్పుడు ఒక్కసారిగా జీరో అయిపోయారు. బీజేపీతో బాబు దోస్తీ ఖాయం అయ్యాక, బాబు వద్ద పవన్ ప్రాధాన్యత పూర్తిగా తగ్గిపోయింది. తొలుత జరిగిన సీట్ల సర్దుబాటు సమయంలో 2 పార్లమెంటు, 24 అసెంబ్లీ సీట్లకి పవన్ అంగీకరించడం అటు ఆయన సామాజికవర్గానికి, అభిమానులకి అసలు నచ్చలేదు. ఇప్పుడు తాజాగా టీడీపీ బీజేపీతో కలిశాక పవన్‌కి ఇచ్చిన అసెంబ్లీ సీట్లలో మళ్ళీ మూడు సీట్లకి మూడి, ఆయనకి 21 మాత్రమే మిగిలాయి. పైగా తాను అసెంబ్లీకి కాకుండా పార్లమెంటుకి పోటీ చేస్తాడని వార్తలు రావడం పవన్, ఆయన పార్టీ శ్రేణులకు అస్సలు నచ్చడంలేదు. ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవు తాడనుకున్న తమ నాయకుడు ఇలా 21 స్థానాలకి దిగజారిపోవడం, పైగా పార్లమెంటుకి పోటీచేస్తాడని వార్తలు రావడం జనసైన్యానికి మింగుడుపడడం లేదు. గడచిన 2019 ఎన్నికలతో పోలిస్తే... ఈ ఎన్నికల సమయానికి పవన్ కళ్యాణ్ పార్టీ బాగానే పుంజుకుంది. గోదావరి జిల్లాలలో ఆ పార్టీ గాలి కొంత ఉంది. సొంతంగా జనసేన గెలవలేక పోయినా, తన మద్దతుతో మరొకరిని గెలిపించే స్థాయికైతే పార్టీ బలపడిందనడంలో సందేహం లేదు. రేపు జగన్ గెలిచి, చంద్రబాబు ఓడిపోతే పవన్ కళ్యాణ్‌కి పెద్దగా నష్టం ఉండకపోవచ్చు. ఎందుకంటే, ఆయన ముందునుంచి బీజేపీతో ఉన్నారు. ఎలాగూ ఆయన నివాసం, ఆస్తులు అన్నీ హైదరాబాదులో కాబట్టి, జగన్ వల్ల జంకాల్సిన అవసరం కూడా పవన్‌కి లేదు. పైగా బీజేపీ అండ, ఆశీస్సులు ఆయనకి ఎలాగూ ఉంటాయంటున్నాయి మేధావి వర్గాలు.



### ఎవరి వ్యూహం వారిది!

సంక్షేమం పేరుతో ఒక్క బటన్ నొక్కడం ద్వారా తానిచ్చిన లక్షల కోట్ల డబ్బులు తనను మళ్ళీ గెలిపించే తీరుతాయన్నది జగన్ మోహన్‌రెడ్డి నమ్మకం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలోని అక్క చెల్లెళ్ళు, అవ్వాతాతలు, రైతు సోదరులూ ఆయనతోనే ఉంటారన్నది జగన్ ఆశ. వారితో పాటుగా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలూ, మైనారిటీలూ తనకి అండగా నిలుస్తారన్నది జగన్ విశ్వాసం.

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులపైన ఉన్న అసంతృప్తి, రాష్ట్రంలో కుంటుపడిన అభివృద్ధి తమని గట్టెక్కిస్తాయన్నది బాబు ధీమా. వీటికి తోడుగా అత్యంత శక్తివంతమైన బీజేపీ గొడుగు కిందకి తాను చేరాడు కాబట్టి, ఆంధ్రాలో ఎలాంటి అక్రమాలకు, అవకతవకలకి, దాడులకు, దౌర్జన్యాలకు తావులేకుండా ఎన్నికలు జరుగుతాయన్నది చంద్రబాబు ధైర్యం.

వైసీపీ, టీడీపీ ఇద్దరిలో ఎవరు గెలిచినా రాష్ట్రంలో తనకి ఒరిగేదేమీ లేదన్నది పవన్ ఉద్దేశ్యం. చంద్రబాబు గెలిస్తే ఆంధ్రాలో తాననుకున్నది సాధించాననుకుని పవన్ సంబర పడతాడు. అలాకాకుండా పవన్ పార్లమెంటు అభ్యర్థిగా గెలిచి, బాబు ఓడిపోతే తాను కూడా తన అన్న లాగా తమ పార్టీని బీజేపీలో కలిపేసి, బదులుగా మంత్రి పదవి తీసుకుంటాడు. ఒకవేళ గత ఎన్నికలలాగా తాను కూడా ఓడిపోతే, ఇక బీజేపీకి మొహం చూపించలేడు కాబట్టి.. చాపచుట్టేసి మళ్ళీ సినిమాలు చేసుకుంటాడు. మొత్తంమీద ఈసారి ఆంధ్రా ఎన్నికలు చాలామంది రాజకీయ నేతల భవిష్యత్తును నిర్ణయించబోతున్నా యన్నది మాత్రం ఖాయం!

## కీర్తి 'శేషం'గా..

# తరలిపోయిన లెక్కల మేస్టారు

## విఆర్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు.. సంజీవరావు అస్తమయం



నెల్లూరులోని విఆర్ కళాశాలలో గణితశాస్త్ర విభాగం అధిపతిగా ఉద్యోగ విరమణ చేసి విశ్రాంత జీవితం గడుపుతున్న వయోవృద్ధులు వి.సంజీవరావు ఈనెల 11న కాలధర్మం చెందారు. ఎంతోమందికి లెక్కలు చెప్పిన ఆ మేస్టారు కీర్తి 'శేషాన్ని' మిగిల్చి వెళ్లిపోయారు. కీర్తిశేషులయ్యారు. ఎంతో సహృదయులు, వేలాదిమందికి గురువు, ఆదర్శప్రాయులైన ఆయన పరిపూర్ణ జీవితాన్ని గడిపి, 96 ఏళ్ళ వృద్ధాప్యంలో అస్తమించారు.

సంజీవరావు అంటే లెక్కలయ్యోరుగా ప్రసిద్ధి. అపర మేధావి. గణితశాస్త్రంలో ఆయన నిష్ణాతులు. ఎంతటి జటిలమైన లెక్కనైనా ఇట్టే వేసేసేవారు. వారు పుట్టింది కందుకూరు నియోజకవర్గంలోని ఉలవపాడు మండలం, చాకిచర్ల గ్రామంలో. ప్రాథమిక విద్య అక్కడే ప్రారంభించి, ఆ తర్వాతి చదువుల కోసం ఆయన నెల్లూరుకు రావడం, రంగనాయకులపేటలోని మునిసిపల్ స్కూల్‌లోనూ, ఆ తర్వాత విఆర్ హైస్కూలులోను చదువుకుని, మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బీఏ, ఎంఏ(మేథమేటిక్స్), స్టాటిస్టిక్స్‌లో డిప్లొమా చేసి, తాను చదువుకున్న విఆర్ కాలేజీలోనే 1951లో జూనియర్ లెక్చరర్‌గా చేరారు. 1952లో ఆయనకు వివాహమైంది. అదే సంవత్సరం ఆయన మేథమేటిక్స్ విభాగం అధిపతులుగా ఉద్యోగోన్నతి పొందారు. వారికి ఆరుగురు సంతానం. అందరూ విద్యావంతులే. మేథమేటిక్స్ విభాగం అధిపతిగా వీఆర్‌సీలో సుదీర్ఘ కాలం పనిచేసి, 1987లో ఆయన అక్కడే రిటైరయ్యారు కూడా. వారి ఇద్దరు కూతుళ్ళు, ఇద్దరు కొడుకులు అమెరికాలో స్థిరపడ్డారు. పెద్దకొడుకు డా.సీవీఎస్ భాస్కర్ కూడా నెల్లూరులో విఆర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి, 2019లో ఉద్యోగ విరమణ పొందారు. విజయవాడలో పని చేస్తున్న తమ కోడలు ఇంట్లో శేషజీవితం గడుపుతున్న సంజీవరావు మృతిచెందారన్న సమాచారం అందరినీ కలచివేసింది.

ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు సంజీవరావు సంజీవని వంటి చదువు చెప్పారు. బహు కష్టమైన లెక్కలను కూడా సులభంగా అందరికీ అర్థమయ్యేరీతిలో చెప్పి వారి జీవితాలను తీర్చిదిద్దారు. అందుకే ఆయనంటే విద్యార్థులకు ఎంతో గౌరవం.

ఆయన మరణవార్త విన్న వెంటనే, ఆయన వద్ద లెక్కలు నేర్చుకున్న వి.ఎస్.రామచంద్రరావు తనయుడు వెన్నెలకంటి ప్రసాద్ గుండెలోతుల్లో నుండి జాలువారిన అక్షర నివాళులు ఆయన మాటల్లోనే...

**'బాల్యంలో బుద్ధిగా చదువుకుని కాలగమనంలో, క్రమశిక్షణతో గణిత శాస్త్రాన్ని ఔపోసన పట్టి, తన జీవన వృత్తంలో తాను తిరుగుతూ.. ఎందరో విద్యార్థుల జీవితాలలో సరళమైన రేఖలను గీసి.. విభిన్న కోణాల ద్వారా ఎంతోమంది భవితలో వెలుగులు నింపి.. సింహపురిలో తన ఉనికిని చాటుకొని, విధాత ఇచ్చిన పాత్రకు న్యాయం చేకూర్చి.. ఎన్ని కూడికలు, తీసివేతలు చేసినా.. చరమాంకమనే భాగాహారంలో.. శేషంగా మిగిలేది 'కీర్తి' మాత్రమే అనే సందేశాన్ని....అందరికీ తెలిపి... వచ్చిన కార్యాన్ని పూర్తిచేసుకొని.. అనంతుని పాదాల చెంతకు.. ఆత్మసాక్షాత్కారం కోసం దివికి ప్రయాణమైన పూజ్యులు శ్రీ చాకిచర్ల సంజీవరావు మాస్టరు గారికి... సదా ఆ... శ్రీహరి వెనువెంట ఉండి.... కైవల్యం ప్రసాదించాలని, వారి ఆత్మ బిందువు.. ఆ కరుణాసింధువులో.. లీనమై పరమశాంతి పొందాలని' ప్రార్థిస్తున్నాను అంటూ...**

ప్రసాద్ తన గురుదక్షిణ సమర్పించుకున్నాడు.

సంజీవరావు మృతికి నివాళులర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తోంది 'లాయర్'.

## రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలకు..

# 20న అంకురార్పణ



### ● 25న బంగారు గరుడసేవ.. 27న రథోత్సవం



రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలకు మార్చి 20న అంకురార్పణ జరగనుంది. మార్చి 31వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు కనుక ఆలయ ధర్మకర్తలు, జిల్లా అధికార యంత్రాంగం ఈ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అంకురార్పణ అనంతరం 21న ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 22న సూర్యప్రభ, హంస వాహనోత్సవాలు, 23న సింహవాహనం – చంద్రప్రభ, 24న పల్లకిసేవ–హనుమంత సేవ, 25న మోహినీ అవతారోత్సవంతో పాటు బంగారు గరుడసేవ, పూలంగిసేవ, 26న పూలంగిసేవ, కల్యాణోత్సవం, గజవాహన సేవ జరుగుతాయి. రంగనాథుని బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన రథోత్సవం ఈనెల 27వ తేదీ ఉదయం జరుగుతుంది. ఈ ఉత్సవానికి మరింత పెద్దసంఖ్యలో భక్తజనులు తరలివస్తారు. అనంతరం పొన్నవాహనోత్సవం నిర్వహిస్తారు. 28న తిరుప్పావ్ న్నాడల్, అశ్వవాహనోత్సవం, 29న ప్రణయ కలహోత్సవం (ముసుగుల సేవ), చక్రస్నానం, పుణ్యకోటి విమానం, 30న వివిధ రకాల పుష్పాలతో వేడుకగా పుష్పయాగం, దవనోత్సవం అనంతరం ధ్వజావరోహణం జరుగుతాయి. 31న స్వామివారి తెప్పోత్సవం నేత్రపర్వంగా నిర్వహిస్తారు. 12 రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు.

### ఏర్పాట్లపై ఆర్డీఓ సమీక్ష :

ఈనెల 7న నెల్లూరు ఆర్డీఓ మలోల, ఆలయ ఛైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు, ఇఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, నగర డిఎస్పీ శ్రీనివాసరెడ్డి తదితరులు సమావేశమై రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులతో కలిసి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పోలీసు శాఖ, అగ్నిమాపక సిబ్బంది, వైద్య ఆరోగ్యసిబ్బంది తదితరులంతా సమిష్టిగా పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఆయా శాఖల వారు చేయాల్సిన ఏర్పాట్లను సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ ఆరోగ్యాధికారి పిడుగు వెంకటరమణ, కార్పొరేటర్ జయలక్ష్మి, ఆలయ అర్చకులు, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, సంతపేట ఆంజనేయస్వామి ఆలయ ఛైర్మెన్ చందోలు సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం



దేశంలోని తొలి మహిళా ఉపాధ్యాయిని, సమాజ సంస్కర్త సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయమని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉల్లిపాయల శంకరయ్య కొనియాడారు. ఈనెల 10న నెల్లూరులోని బీసీ విద్యార్థి భవన్‌లో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం జరిగింది. తొలుత మహాత్మ జ్యోతిరావు పూలే–సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్త్రీమూర్తులు గౌరవించబడితేనే సమాజాభివృద్ధికి బాటలు వేసినట్లవుతుందన్నారు. బడుగు బలహీనవర్గాల ప్రజలకు, బహుజనులకు విద్యాబోధ చేసి వారి అభ్యున్నతికి కృషిచేసిన పూలే దంపతుల సేవలు, వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా సమాజానికి ఉత్తమ సేవలందిస్తున్న సుప్రియ, ఉమామహేశ్వరిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు కె.వెంకటేశ్వరరావు, ఆర్.మల్లికార్జునరావు, ఏ.దయాకర్, వి.శ్రీనివాసులు, కె.జయరామరాజు, పి. విజయకుమార్, కె.సునీల్‌కుమార్, పి.సుబ్బారావు, కె.వెంగబాబు, కె.రాజాచారి తదితరులు పాల్గొన్నారు.

# కనువిందుగా.. మల్లేశ్వరస్వామి రథోత్సవం



ఇందుకూరుపేటలో వెలసివున్న కామాక్షీదేవి సమేత శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్స వాల సందర్భంగా ఈనెల 10న స్వామివారికి, అమ్మవారికి రథోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. వేలాదిగా గ్రామస్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. దారిపొడవునా భక్తులు గుమ్మడికాయలు, కొబ్బరికాయలు కొట్టి హారతులిచ్చారు. ఆలూరు వంశస్తులు ఈ సేవ నిర్వ హించగా, ఆలయ అర్చకులు రామాయణం మణికుమార్‌శర్మ పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ ఇఓ మస్తాన్‌బాబు పర్యవేక్షించారు.

## టూకీగా...



### నందిపాడు గురుకుల పాఠశాలలో 'ఫిట్‌నెస్ రన్'

దుత్తలూరు మండలం నందిపాడు కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల పాఠశాలలో ఈనెల 10న నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో నారీశక్తి కార్యక్రమం నిర్వహించారు. బాలికలకు ఫిట్‌నెస్ రన్నింగ్ రేస్ పోటీలు పెట్టి విజేతలకు బహుమతులిచ్చారు. పూజ, జస్విత, తనూషలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు.

### గుడ్లూరులో గర్భిణులకు వైద్యపరీక్షలు

కందుకూరు నియోజకవర్గంలోని గుడ్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఈనెల 9న 'ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్' పథకం కింద 25 మంది గర్భిణులకు వైద్యాధికారి నబిహా సుల్తానా వైద్యపరీక్షలు చేసి తగు సలహాలు ఇచ్చి మందులు అందజేశారు. పౌష్టికాహారం తీసుకుని అందరూ ఆరోగ్యంగా ఉండాలని వారికి సూచించారు.

### ఆత్మకూరులో ఆటో ఢీ.. హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలు

ఆత్మకూరు సబ్‌జైలులో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాములు ఇటీవల ఆటో ఢీకొని గాయాల పాలయ్యారు. స్థానిక రామాలయం వీధిలో స్కూటర్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తలకు దెబ్బతగిలిన రాములును స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు.

### వరికుంటపాడులో.. 3 ఇసుక ట్రాక్టర్ల సీజ్

వరికుంటపాడు మండలం కనియంపాడు వద్ద ఉన్న పిల్లాపేరు వాగు నుంచి ఈనెల 10న అర్ధరాత్రి సమయంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఇలాంటి అక్రమాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని ఎస్ఐ తిరుపతయ్య చెప్పారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు.

### బుచ్చి బీసీ బాలికల హాస్టల్‌లో సరస్వతి పూజ

పదవతరగతి పరీక్షల్లో తమ హాస్టల్ విద్యార్థినులు మంచి మార్కులు తెచ్చుకోవాలని కోరుకుంటూ ఈనెల 11న బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని బీసీ బాలికల హాస్టల్‌లో సరస్వతి పూజ చేశారు. వసతిగృహ సంక్షేమశాఖ అధికారిణి లక్ష్మితో పాటు విద్యార్థినులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

### పాటూరులో పౌష్టికాహారంపై అవగాహన

కోవూరు మండలం పాటూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఈనెల 11న గర్భిణులు, బాలింతలకు ఐసిడిఎస్ సీడీపీఓ జ్యోతి ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించి పౌష్టికాహారం పట్ల అవగాహన కల్పించారు. ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలు, కోడిగుడ్ల వంటి పోషకాహారం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని వారికి సూచించారు.

### చాగల్లు వద్ద ట్రాక్టర్ ఢీకొని యువకుడి దుర్మరణం

ఉలవపాడు మండలం చాగల్లు సమీపంలో ఈనెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ ఢీకొని, మోటార్‌బైక్‌పై వెళ్తున్న మార్టూరు మండలం కె.రాజుపాలెంకు చెందిన సువ్వల సాయితేజ(24) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఎస్ఐ బాజిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### భీమవరంలో వేడుకగా హైస్కూల్ వార్షికోత్సవం

ఉలవపాడు మండలం భీమవరం జడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం ఈనెల 11న వేడుకగా జరిగింది. హెడ్మాస్టర్ బండి సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు తెలిపారు. ఉపాధ్యాయులు శ్రీధర్, ప్రసాద్, హనోక్, మస్తాన్‌వలి, హేమలత, చిట్టిబాబు, సుబ్బారావు, లలిత, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

### గండవరంలో భక్తులకు అన్నదానం

కొడవలూరు మండలం గండవరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులకు స్థానిక కల్పవృక్ష సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 9న అన్నదానం చేశారు. సొసైటీ వ్యవస్థాపకురాలు ఎన్.సునీతారెడ్డి, సభ్యులు విజయలక్ష్మి, శ్రీలక్ష్మి, రాజ్యలక్ష్మి, జ్యోతి, అపర్ణ, నీలిమ, తులసి తదితరులు పర్యవేక్షించారు.

# వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేరు ఖరారు!

(3వ పేజీ తరువాయి)

ఓటమి పాలైనప్పటినుండి తన కుమారుడు పోలంరెడ్డి దినేష్‌రెడ్డిని నియోజకవర్గానికి పరిచయం చేశారు. కొడుకుని ఏంఎల్‌ఏగా చూడాలనుకున్నారు. ఇప్పుడు ఆ ఆశలు అడియాశలయ్యాయి. జిల్లాలో జరిగిన అనూహ్య రాజకీయ పరిణామాల వల్ల కోవూరు సీటు ప్రశాంతిరెడ్డికి వెళ్ళిపోయింది.

## తొలిసారిగా రాజకీయాల్లోకి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి!

చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి సమీపంలోని పునబాక ప్రశాంతిరెడ్డి జన్మస్థలం. చదువుకునే రోజులనుండి నాయకత్వపు లక్షణాలు కలిగిన ప్రశాంతిరెడ్డి, తిరుపతి ఎస్‌వి మహిళా కళాశాలలో చదువుకునే రోజుల్లో విద్యార్థి యూనియన్ జాయింట్ సెక్రటరీగా కూడా పోటీ చేశారు. ప్రశాంతిరెడ్డి ఇప్పుడు తొలిసారిగా రాజకీయ అరంగేట్రం చేశారు. కోవూరు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ప్రసన్నకుమార్‌రెడ్డిపై పోటీ చేయనున్నారు. మొన్నటివరకు వీపీఆర్ వైసీపీలో ఉండడంతో ఆమె కూడా భర్త వెంటే ఆ పార్టీలో వున్నారు. విపిఆర్ ఫౌండేషన్ పేరుతో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చేసే అనేక సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రశాంతిరెడ్డి కూడా భాగస్వామ్యు రాలయ్యారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ట్రస్టు బోర్డు సభ్యురాలిగా, టీటీడీ దేవస్థానాల ఉత్తర భారతదేశ సలహామండలి అధ్యక్షురాలిగా ఆమెకు జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారు. ఐదేళ్ళు జగన్ వెంట నడిచిన వీపీఆర్ దంపతులు సరిగ్గా ఎన్నికలవేళ పార్టీ మారి వైసీపీ అభ్యర్థులపై పోటీ చేయబోతున్నారు. తమ పార్టీ నుండి నెల్లూరు పార్లమెంటుకి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు నుండి ఆయన సతీమణి ప్రశాంతి రెడ్డి పోటీ చేస్తుండడంతో తెలుగు తమ్ముళ్ళు సంబరాలు చేసుకుంటున్నారు.

## నల్లపరెడ్ల కంచుకోట కోవూరు!



కోవూరు నియోజకవర్గం ఏర్పడిన తరువాత 1952 నుండి 2019 వరకు ఇప్పటికి 16సార్లు ఆ నియోజక వర్గంలో ఎన్నికలు జరిగితే 9సార్లు నల్లపరెడ్డి కుటుంబమే గెలిచింది. 1952 నుండి 1962 వరకు కోవూరు కామ్రేడ్ల చేతిలో ఉండేది. అప్పట్లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా పక్షాన బసవరెడ్డి శంకరయ్య శాసన సభ్యుడిగా ఉన్నారు. ఆ తరువాత 1962 నుండి 1967వరకు రేబాల దశరథరామిరెడ్డి, 1967 నుండి 1972 వరకు వేమారెడ్డి వెంకురెడ్డి, 1972 నుండి 1983 వరకూ రెండు పర్యాయాలు గెలిచిన పెళ్లకూరు రామచంద్రారెడ్డి దాకా అందరూ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులుగా విజయం సాధించినవారే. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తరువాత 1983, మళ్ళీ 1985లో నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించారు. ఆ తరువాత 1989లో ఆయన కాంగ్రెస్‌పార్టీలో చేరి, ఆ పార్టీ పక్షాన బరిలో నిలిచి గెలిచారు. శీనయ్య మరణానంతరం 1993లో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ టిక్కెట్టు పెళ్లకూరు రామచంద్రారెడ్డికి దక్కడంతో ఆ ఎన్నికలలో నల్లపరెడ్డి వారసుడిగా ప్రసన్న తెలుగుదేశం తరపున పోటీచేసి గెలిచారు. పెళ్లకూరు రామచంద్రారెడ్డి ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న దివంగత మాగుంట సుబ్బరామిరెడ్డి ప్రసన్నని ఓడించడానికి సర్వశక్తులూ ఒడ్డినా, శీనయ్య సింపతీ ముందు అవన్నీ పనిచేయలేదు. ఆ తరువాత 1994, 1999 ఎన్నికలలో కూడా ప్రసన్న టీడీపీ తరపున పోటీచేసి గెలిచారు. 2004, మళ్ళీ 2014లో పోలంరెడ్డి కోవూరులో ప్రసన్నపై గెలిచి నల్లపరెడ్ల పరంపరకి అడ్డుకట్ట వేశారు. తాజాగా, 2019లో ప్రసన్నే గట్టెక్కారు.

యోధానుయోధులు బరిలోదిగి పోరాటం సాగించిన ఘనచరిత్ర ఉన్న నియోజకవర్గం కోవూరు. ఆ నియోజకవర్గం నుండి ఇప్పుడు కొత్త అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సీటు దక్కించుకుని పోటీ చేయబోతున్నారు. రాష్ట్రంలో టీడీపీ నెగ్గుతుందా – వైసీపీయే గెలుస్తుందా అన్నంతగా, రేపు కోవూరు ఫలితం కూడా ఎలావుండబోతుందోనన్న ఆసక్తి, ఉత్కంఠ ఇప్పుడు జిల్లా రాజకీయ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

# ‘పీఎం సూరజ్ జాతీయ పోర్టల్’ ప్రారంభం

**• నెల్లూరు నుండి వర్చువల్‌గా వీక్షించిన గవర్నర్**



రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నెల్లూరు పర్యటన ప్రశాంతంగా జరిగింది. ఈనెల 13వ తేది మధ్యాహ్నం విజయవాడ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చిన గవర్నర్ దంపతులకు జిల్లా అధికారులు స్వాగతం పలికారు. సమాజంలో వెనుకబడిన వర్గాలైన సఫాయి కర్మచారీ లబ్ధిదారుల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోడీ ఢిల్లీ నుంచి ప్రారంభించిన ‘పీఎం సూరజ్ జాతీయ పోర్టల్’ ప్రారంభ కార్యక్రమాన్ని నెల్లూరులోని కస్తూర్బా కళా క్షేత్రంలో ఆయన వర్చువల్‌గా వీక్షించారు. ఈ సందర్భంగా పలు రాష్ట్రాల్లోని లబ్ధిదారులతో ప్రధాని మోడీ మాట్లాడుతూ, కేంద్రం అమలుచేస్తున్న పథకాల వల్ల వారి జీవితాల్లో కలిగిన మార్పును అడిగి తెలుసుకున్నారు. ఆ కార్యక్రమాన్ని తిలకించిన అనంతరం స్త్రీనిధి, ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ లబ్దిదారులకు గవర్నర్ రూ.5.21 కోట్ల మెగా చెక్కును అందజేశారు. అర్హులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులు, సఫాయి కార్మికులకు పీపీఇ కిట్లు ఇచ్చారు. కళా క్షేత్రంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్ళను సందర్శించి చేతివృత్తిదారులతో ముచ్చటించారు. తొలుత కస్తూర్బా కళా క్షేత్రం వద్ద పోలీసు అధికారుల నుంచి గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు.

### మహాకవయిత్రి

## మొల్లమ్మకు నివాళి



ప్రముఖ కవయిత్రి, ‘రామాయణం’ రచయిత్రి మొల్లమ్మ జయంతి వేడుకలు ఈనెల 13న నెల్లూరులో ఘనంగా జరిగాయి. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె చిత్రపటానికి ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. 16వ శతాబ్దం నాటి మొల్లమ్మ, ఆ కాలంలోనే సరళమైన భాషలో రామాయణాన్ని రచించడం గొప్ప విశేషమని కొనియాడారు. ఏఎస్పీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# సీఏఏ చట్టంపై నిరసనలు



కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై నెల్లూరులో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తం చేశారు. ఆ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నగరంలోని ఆత్మకూరు బస్టాండు వద్ద నుంచి గాంధీబొమ్మ వరకు ఈనెల 13న ర్యాలీ నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం అభివృద్ధిని గాలికొదిలేసి కులాలు మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతోందని విమర్శించారు. సీపీఎం నాయకులు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, సిపిఐ నాయకుడు రామరాజు, సీఐటియు నాయకుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జేవీవీ కార్యకర్త.. దేహ సమర్పణ



నెల్లూరులో జనవిజ్ఞానవేదిక కార్యకర్తగా చురుగ్గా పనిచేస్తున్న స్థానిక ఎన్టీఆర్ నగర నివాసి సోమిశెట్టి మోహన్‌రావు తన 68వ ఏట ఈ నెల 12న అనారోగ్యంతో మరణించారు. ఆయన పెద్దకుమార్తె యోగితా చైతన్య తమ తండ్రి దేహాన్ని పినాకిని దేహ సమర్పణ సంస్థ ద్వారా నారాయణ వైద్యకళాశాలకు అప్పగించారు. ఈ సందర్భంగా దేహసమర్పణకు సహకరించిన ఆయన కుటుంబ సభ్యులను అభినందిస్తూ, ఇది తమ సంస్థ ద్వారా జరిగిన 35వ దేహ సమర్పణ అని ఆ సంస్థ నిర్వాహకులు తిక్కవరపు సుకుమార్‌రెడ్డి ఈనెల 14న ఒక ప్రకటనలో తెలిపారు.

# బర్డ్‌ఫ్లూపై భయం వద్దు

**-జిల్లాలో కేంద్రబృందం పర్యటన**



జిల్లాలో బర్డ్‌ఫ్లై వ్యాధి ప్రబలిందంటూ ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో, ఆ వ్యాధి నిర్ధారణ కోసం కేంద్రబృందం మూడవసారి పరిశీలన చేసింది. పొదలకూరులోను, కోవూరు మండలం గుమ్మళ్ళ దిబ్బలో ఈనెల 13న కేంద్ర బృందం పర్యటించింది. ఢిల్లీలోని కేంద్రప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ నేషనల్ సెంటర్ ఫర్ డిసీజెస్ సంయుక్త కమిషనర్ డాక్టర్ విజయకుమార్, భోపాల్‌కు చెందిన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మనోజ్‌కుమార్ వచ్చి గ్రామంలో బర్డ్‌ఫ్లూ ప్రబలిన ప్రాంతాల్లో ఉన్న కోళ్ళను పరిశీలించారు. ఆ కోళ్ళను ఎక్కడినుంచి తీసుకువచ్చారు, ఎప్పుడు వైరస్ సోకింది, ఎన్ని కోళ్ళు చనిపోయాయి, ప్రయోగశాలకు ఎప్పుడు తీసుకువెళ్ళారు..అంటూ గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బర్డ్‌ఫ్లూ పై భయం వద్దని, మూడుసార్లు నమూనాలు సేకరించినా వాటిలో ఎలాంటి వ్యాధిలక్షణాలు లేవని తెలిపారు. అయినప్పటికీ ఆ వ్యాధిపట్ల అప్రమత్తంగానే ఉండాలని వారు స్పష్టం చేశారు. ఏదైనా అనుమానం ఉంటే అధికారులకు తెలపాలని వారు సూచించారు. పొదలకూరు మండలంలోని చాటగొట్ల, తోడేరు, బిరదవోలు గ్రామాల్లో, కోవూరు మండలం గుమ్మళ్ళదిబ్బ ప్రాంతాల్లో ఇటీవల ఆకస్మికంగా కోళ్ళు చనిపోవడంతో బర్డ్‌ఫ్లూ వచ్చి వుంటుందని, వాటి వల్ల ఎలాంటి అనారోగ్యం కలుగుతుందోనని గ్రామస్తులు భయపడుతున్న నేపథ్యంలో, అలాంటి భయాలేమీ వద్దని, కోడిమాంసాన్ని బాగా వేడిచేసిన తర్వాత అందులోని బాక్టీరియా చనిపోతుందని ధైర్యం ఇచ్చారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com